


# విజయభాను




విశాఖపట్నం, శుక్రవారం 20-09-2019 | VIJAYABHANU DAILY ✱ VISAKHAPATNAM | సంపుటి : 43 సంచిక : 10 పేజీలు : 8 వెల : 1 రూపాయి




## 21నుంచి మోదీ అమెరికా పర్యటన



న్యూఢిల్లీ: భారత ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 21 నుంచి 27 వరకు అమెరికాలోని హోస్టన్, న్యూయార్క్ నగరాల్లో పర్యటించనున్నారు. 21న ఢిల్లీ విమానాశ్రయం నుంచి బయలుదేరనున్న మోదీ.. హోస్టన్ నగరానికి చేరుకుంటారు. హోస్టన్‌లో నిర్వహించే రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొంటారు. సమావేశంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, డెమొక్రటిక్ నేతలతో కలిసి ప్రసంగిస్తారు. మరుసటి రోజు ఐక్యరాజ్యసమితి నిర్వహిస్తున్న వాతావరణ సదస్సులో ప్రసంగిస్తారు. ఇదే సదస్సులో ఆరోగ్యం, ఉగ్రవాదం అంశాలపై తన వివరణ తెలుపుతారు. తరువాత ప్రవాస భారతీయులతో ఆయన సమావేశమవుతారు.

24న ఐరాస సెక్రటరీ జనరల్ ఇచ్చే విందుకు హాజరవుతారు. ఐక్యరాజ్యసమితి తరువాయి 2లో..

## తేజస్‌లో ప్రయాణం ఓ కొత్త అనుభూతి

- తేజస్‌లో ప్రయాణించిన తొలి రక్షణమంత్రి
- భారత వాయుసేన అమ్ములపొదిలో తేజస్
- రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్




బెంగళూరు: స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన తేలికపాటి యుద్ధవిమానం తేజస్‌లో కేంద్ర రక్షణమంత్రి రాజ్ నాథ్ సింగ్ ప్రయాణించారు. గురువారం ఉదయం బెంగళూరులోని హిందుస్తాన్ ఏరోనాటికల్ లిమిటెడ్ (హాల్) ఎయిర్ పోర్టుకు చేరుకున్న రాజ్‌నాథ్.. జీ-సూట్, హెల్మెట్, ఆక్సిజన్ మాస్క్ ధరించి తేజస్‌లోకి ఎక్కారు.. పైలట్ వెనుక కూర్చుని ప్రయాణించారు. మధ్యలో ఓసారి యుద్ధవిమానాన్ని నియంత్రించారు కూడా. పైలట్ చెబుతుండగా దాదాపు 2 నిమిషాల పాటు రాజ్‌నాథ్ తేజను నియంత్రిస్తూ నడిపారని డీఆర్డీవో చీఫ్ సతీష్ రెడ్డి తెలిపారు. అనంతరం రాజ్‌నాథ్ మాట్లాడుతూ.. తేజస్‌లో ప్రయాణించడం కొత్త అనుభూతినిచ్చిందన్నారు. తాను స్వయంగా నడిపిన రెండు నిమిషాలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని తెలిపారు .

- తేజస్‌లో ప్రయాణించిన తొలి రక్షణమంత్రిగా రాజ్‌నాథ్ రికార్డు సృష్టించారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం - ఆయన నిన్న బెంగళూరు చేరుకున్నారు. డీఆర్డీవోకు చెందిన రక్షణ ఉత్పత్తుల ప్రదర్శనకు రాజ్‌నాథ్ హాజరుకానున్నారు. తేజస్ యుద్ధ విమానాలను భారత వాయుసేన తరువాయి 2లో..

## సచివాలయ ఫలితాలు విడుదల

ఒకే నోటిఫికేషన్ ద్వారా 1,26,738 శాశ్వత ఉద్యోగాలు

అక్టోబర్ 2 నుంచి గ్రామ సచివాలయ పోస్టులు



అమరావతి : లక్షలాది మంది అభ్యర్థులు ఎంతో ఉత్కంఠగా ఎదురుచూస్తున్న సచివాలయ ఉద్యోగాల రాత పరీక్షల ఫలితాలు విడుదలయ్యాయి. గురువారం మధ్యాహ్నం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన క్యాంపు కార్యాలయంలో ఫలితాలను విడుదల చేశారు. ఫలితాలను gramasachivalayam.ap.gov.in వెబ్‌సైట్‌లో చూడవచ్చు. ఈ నెల ఒకటి నుంచి 8 వ తేదీ వరకూ ఎపి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ లో గ్రామ వార్డు, సచివాలయ ఉద్యోగాలకు పరీక్షలను నిర్వహించింది. 19 రకాల పోస్టులకుగాను 14 పరీక్షలు నిర్వహించిన ఏపీ ప్రభుత్వం.. కేవలం 10 రోజుల్లోనే ఫలితాలను విడుదల చేశారు. ఈ పరీక్షలకు 19.74 లక్షల మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 30 నుంచి అక్టోబర్ 1వరకు శిక్షణ ఇస్తారు. పరీక్ష విడుదల కార్యక్రమంలో మంత్రులు బొత్స సత్యనారాయణ, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో పాటు పలువురు ఉన్నతాధికారులు ఉన్నారు.

### రికార్డు సమయంలో ఈ యజ్ఞాన్ని పూర్తి చేశాం సీఎం జగన్

ఎన్నికల్లో చెప్పినట్లుగా సచివాలయ ఉద్యోగాలను రికార్డు సమయంలో భర్తీ చేశామని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. 10 రోజుల్లో ఫలితాలు విడుదల చేసేలా కృషి చేసిన అధికారులకు అభినందనలు తెలిపారు. 'ఒకే తరువాయి 2లో..

## పడవ ప్రయాణాల్లో ప్రమాణాలు పాటించాలి

- లైఫ్ జాకెట్, జీవిత బీమా తప్పనిసరిగా ఉండాలి
- సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలి
- సముద్ర తీరాల్లో 'లైఫ్ గార్డ్' కొనసాగించాలి
- పర్యాటక శాఖ మంత్రి ఎం శ్రీనివాసరావు



విశాఖపట్నం: గోదావరి నదిలో జరిగిన దుర్ఘటన ఇకమీదట జరగకుండా జాగ్రత్త పడవలసిన బాధ్యత ప్రభుత్వంతో పాటు అందరిపైనా ఉందని పర్యాటక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాస రావు పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన పర్యాటక ప్రాంతాలలో ప్రమాదాలు జరగకుండా అనుసరించవలసిన విధానాలపై సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ సముద్రము, నదులు, జలాశయాలు, జలపాతాలు వంటి పర్యాటక ప్రాంతాలలో ఖచ్చితంగా నిబంధనలను పాటించాలన్నారు. బోట్లకు లైసెన్సులు, 'లైఫ్ గార్డ్స్' నియామకానికి నిబంధనలను పరిశీలించేందుకు ఒక కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. ఈ కమిటీలో రెవిన్యూ, నేవీ, మత్స్యశాఖ, ఇరిగేషన్, పర్యాటక, జీవీఎంసీ అధికారులతో కూడిన ఈ కమిటీ జీవీఎంసీ కమిషనర్ అధ్యక్షతన పని చేస్తుందని చెప్పారు. పర్యాటక ప్రాంతాలలో తరువాయి 2లో..

**మనం ఎంతటి మేధస్సును సాధించినా.. ప్రకృతి వ్యతిరేకతను ఎదుర్కోవడం కష్టం**

**జిల్లా కలెక్టరు వి.వినయ్ చంద్**

జిల్లా కలెక్టరు వి.వినయ్ చంద్ మాట్లాడుతూ గోదావరిలో జరిగిన పడవ ప్రమాదం సమన్వయ లోపం కారణంగానే జరిగినట్లు తెలియ వచ్చిందన్నారు. మనం ఎంతటి మేధస్సును సాధించినా.. ప్రకృతి వ్యతిరేకతను ఎదుర్కోవడం ఎంతో కష్టమని చెప్పారు.

## మూడు అసెంబ్లీ కమిటీల ఏర్పాటు

అమరావతి: మూడు అసెంబ్లీ కమిటీలను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పయ్యావుల కేశవ్ చైర్మన్‌గా 12 మంది సభ్యులతో పీఏసీ కమిటీ వేయనున్నారు.

రాజన్న దొర చైర్మన్‌గా 12 మంది సభ్యులతో అంచనాల కమిటీ, చిర్ల జగ్గిరెడ్డి చైర్మన్‌గా 12 మందితో పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ, మూడు కమిటీల్లో ఉభయసభలకు చెందిన సభ్యులకు ప్రాధాన్యం కల్పిస్తారు.

## బోటు ప్రమాదంపై విచారణ కమిటీ ఏర్పాటు

అమరావతి: తూర్పు గోదావరి జిల్లాలో జరిగిన బోటు ప్రమాదంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గురువారం ప్రత్యేక విచారణ కమిటీని ఏర్పాటు చేసింది.

ఇరిగేషన్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీని చైర్మన్‌గా వ్యవహరించనున్న ఈ కమిటీలో రెవెన్యూ చీఫ్ సెక్రటరీ, తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్, టూరిజం ప్రిన్సిపల్ సెక్రటరీ, లా అండ్ ఆర్డర్ అడిషనల్ డీజీ సభ్యులుగా ఉంటారు. బోటు ప్రమాదంపై మూడు వారాల్లో నివేదిక ఇవ్వాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కమిటీని ఆదేశించారు.

45 రోజుల్లో లాంచీ ప్రమాదానికి కారణమైన బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సీఎం అధికారులను ఆదేశించారు. తూర్పు గోదావరి జిల్లా దేవీపట్నం మండలం కచులూరు సమీపంలో బోటు మునిగిపోయి పలువురు ప్రయాణికులు మరణించిన సంగతి తెలిసిందే.

## నైపుణ్య అభివృద్ధి శిక్షణా కార్యక్రమం సద్వినియోగం చేసుకోవాలి

**శ్రీరామా స్క్వేర్ ఇన్‌చార్జ్ పద్మనాభుని రాయుడు, శ్రీసుమ**

నర్సీపట్నం: శ్రీరామా వారి ఆధ్వర్యంలో దీన్ దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన ద్వారా ఉచిత నైపుణ్య అభివృద్ధి శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నామని శ్రీరామా స్క్వేర్ ఇన్‌చార్జ్ పద్మనాభుని రాయుడు, శ్రీసుమ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీరామ వారి ఆధ్వర్యంలో నర్సీపట్నంలోని స్థానిక బైపాస్ రోడ్డులో గల రిషి పాఠశాల వద్ద నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎలక్ట్రికల్, అసెంబ్లింగ్ ఆపరేటర్, పిసిబి కంట్రోల్ ప్యానల్ కోర్సు, ఫార్మాసిస్టు కోర్సుకు శిక్షణ నిర్వహిస్తున్నామన్నారు. 90 రోజుల పాటు శిక్షణ ఉంటుందని, పదో తరగతి పైబడి అభ్యర్థులు అర్హులన్నారు. 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు ఉండాలన్నారు. పార్మానిస్టు కోర్సుకు ఇంటర్ పైబడిన అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆధార్, రేషన్ కార్డు, విద్యార్హత దృవపత్రాలు, ఎనిమిది పాస్ ఫొటోలు అందజేయాలన్నారు. శిక్షణా కాలంలో ఉచిత వసతి, భోజన సదుపాయం ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల వారు 8143239324, 9553530343 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

## జామాయిల్ కలప పట్టివేత

కోటవురట్ల: అనుమతి లేకుండా తరలిస్తున్న జామాయిల్ కలపను రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. కోటవురట్ల పూరకొండ సమీపంలో కొందరు కలపను తరలించడానికి సిద్ధమవగా రైతులు రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. ఆర్ఐ ప్రసాదరావు, వీఆర్ఏ ప్రసాద్‌తో వెళ్లి ట్రాక్టర్‌తో ఉన్న కలపను పట్టుకున్నారు. భూమి హక్కు పత్రాలను చూపించే వరకూ కలపను, ట్రాక్టర్‌ను వదిలి పట్టేది లేదని, ఎటువంటి పత్రాలు లేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆర్ఐ హెచ్చరించారు.

## సంత స్థలంలో పారిశుధ్య పనులు

మాకవరపాలెం: మండల కేంద్రంలో ఉన్న సంత స్థలంలో పారిశుద్య పనులు చేపట్టారు. మండల ప్రత్యేకాధికారి ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శి పర్యవేక్షణలో సిబ్బంది వ్యర్థాలతో పాటు చెత్తా చెదారాన్ని తొలగించారు. అనంతరం కాలువల్లో బ్లీచింగ్, ఫినాయిల్ చల్లారు. వారానికి రెండు రోజుల పాటు సంతలో ఈ పనులు చేపడతామని కార్యదర్శి వివరించారు.

## శాంతి భద్రతల పరిరక్షణకు కృషి

యలమంచిలి రూరల్: సమాజంలో శాంతి భద్రతలను కాపాడేందుకు పోలీసులకు ఎప్పటికప్పుడు సమాచార ఇస్తూ వాలంటీర్లు శక్తివంచన లేకుండా విధులు నిర్వర్తించాలని యలమంచిలి టౌన్ ఎస్సై నాగకార్తీక్ అన్నారు. ఇటీవల నియమితులైన పోలీసు వాలంటీర్లకు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాలను నియంత్రించడంలో పోలీసులకు ఏ విధంగా సహాయపడాలి, వివిధ కూడళ్లలో ఏర్పాటు చేసిన సిసి కెమెరాల పనితీరు తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది ఉన్నారు.

## సింహాచలం గ్రామీణ ఆరోగ్య కేంద్రంలో పుట్టిన శిశువు మృతి

సింహాచలం : సింహాచల గ్రామీణ ఆరోగ్య కేంద్రంలో పుట్టిన శిశువు మృతి బంధువులు ఆందోళన బుధవారం రాత్రి వరలక్ష్మి గర్భిణీ స్త్రీ గ్రామీణ ఆరోగ్య కేంద్రంలో ఒక శిశువుకు జన్మనిచ్చింది ఈ సమయంలో శిశువుకు అనారోగ్యం చేయడంతో అత్యవసర నిమిత్తం తరలించారు. అత్యవసర వైద్యం కోసం తరలించే సమయంలో ఆసుపత్రి సిబ్బంది బంధువులు అంబులెన్స్ సిబ్బంది సమన్వయ లోపంతో కొంత సమయం వృధా చేయడం తో కేజీహెచ్కు తరలించిన తర్వాత శిశువు మృతి చెందింది. ఈ విషయం ఆంధ్ర కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్ దృష్టికి వెళ్లడంతో ఆయన గురువారం ఉదయం ఆస్పత్రికి చేరుకొని విచారణ చేపట్టారు. ఈ సమయంలో 72వ వార్డు వైకాపా నాయకులు కొలుసు ఈశ్వరరావు, రామరాజు, దాసరి కనకరాజు, కర్రీ సత్తిబాబు ఆసు పత్రుల్లో మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు చేపట్టాలని కోరుతూ ప్రిన్సిపాల్‌కు వినతిపత్రం సమర్పించారు.

## ఆర్థిక చేయూతను సద్వినియోగం చేసుకోవాలి

కోటవురట్ల: ఆటో డ్రైవర్లు, కమ్ యాజమానులకు రాష్ట్ర ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని అర్హులందరూ దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ సువర్ణరాజు కోరారు. ఈ మేరకు ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆటో, క్యాబ్, మాక్సి క్యాబ్ యాజమానులు కమ్ డ్రైవర్లకు ఏటా రూ.10వేల ఆర్థికసాయం చేయాలని తీసుకున్న నిర్ణయం మేరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు సొంత ఆటో ఉండి డ్రైవర్‌గా పని చేస్తూ ఉండాలన్నారు. వీరికి ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్, మరమ్మత్తుల కోసం ఈ ఆర్థిక సాయం మంజూరు చేస్తున్నారని తెలిపారు. ఈ నెల 25వ తేదీతో దరఖాస్తు గడువు ముగుస్తుందని లబ్ధిదారులు ఆన్‌లైన్‌లో కాని, నేరుగా కాని దరఖాస్తులు అందజేయవచ్చునని సూచించారు.

## మీ సేవా కేంద్రాల నిర్వాహకుల సమస్యలు పరిష్కరించాలంటూ ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యే ధర్మశ్రీకి వినతిపత్రం అందిస్తున్న మీ సేవ నిర్వాహకులు

చోడవరం : పట్టణంలోని మీ సేవా కేంద్రాల నిర్వాహకుల సమస్యలు పరిష్కరించాలంటూ చోడవరం నియోజకవర్గంలోని మీ సేవా కేంద్రం ఆపరేటర్లు స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీకి గురువారం వినతి పత్రం అందచేశారు.ప్రభుత్వ సేవలు, ప్రజలకు సేవలు అందించే ముఖ్య ఉద్ధేశ్యంతో అప్పటి దివంగత ముఖ్యమంత్రి వై.యస్.రాజేశేఖర్ రెడ్డి మీ సేవలు ఏర్పాటు చేయడం జరిగిందని, వీటిని ఆధారంగా లక్షలాది కుటుంబాలు ఉపాధి పొందుతూ ప్రజలకు సేవలు అందిస్తున్నాయని, అయితే ప్రస్తుత ప్రభుత్వం గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేయడం ద్వారా మీ సేవ కేంద్రాల నిర్వాహకుల కమీషన్ ఆదాయంపై ప్రభావం పడే అవకాశముందనని, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దీనిని పరిశీలించి గ్రామ సచివాలయాల నియామకాలలో ఉద్యోగం కల్పించాలని ఎమ్మెల్యేను కోరారు.

ఈ కార్యక్రమంలో ఉపా ధ్యాయుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పెద్దాపురం అడిషనల్ ఎస్ఐగా కిషోర్



పెద్దాపురం : పెద్దాపురం పోలీస్ స్టేషన్‌కి అదనపు సబ్ ఇన్‌స్పెక్టర్‌గా వి.కిషోర్ గురు వారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. సబ్ ఇన్‌స్పెక్టర్ సురేష్ కార్యాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ ప్రస్తు తం జిల్లా ఎస్పీ కార్యా లయం నుండి నేరుగా పెద్దాపురం పోలీస్ స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించడం జరిగిందని, 2014లో ఇన్ స్పెక్టర్‌గా సెలక్ట్ అయిన తరు వాత ఏజెన్సీ ప్రాంతం అయిన చింతూరు, మోతు గూడెంలో పని చేశామని, ఆ తరువాత సామర్లకోటలో 4 నెలలు పని చేశానని తెలిపారు. ప్రస్తుతం అదనపు సబ్ ఇన్ స్పెక్టర్‌గా పెద్దాపురం పోలీస్ స్టేషన్‌లో పదవీ బాధ్యతలు స్వీక రించినట్లు కిషోర్ తెలిపారు.

## ఘనంగా 'సైరా' సినిమా ట్రైలర్ వేడుకలు



విశాఖపట్నం : అఖిల భారత చిరంజీవి యువత అధ్యక్షులు స్వామినాయుడు పిలుపు మేరకు బుధవారం విజయ నగరం జిల్లా మెగా ప్యామిలీ సేవాసంఘం గౌ॥ అధ్యక్షులు ఒమ్మి శ్రీను పర్యవేక్షణలో జిల్లా అధ్యక్షులు రాంకి అధ్వర్యంలో స్థానిక ఎన్.సి.ఎస్. థియేటర్‌లో మెగాస్టార్ చిరంజీవి సినిమా " సైరా " ట్రైలర్ వేడుకలు రంగ రంగ వైభవంగా జరిగినవి. ముందుగా దియేటర్ మేనేజరు కేక్ కటింగ్ చేయగా అందరి సినీస్టార్స్ అభిమానులు, నందమూరి ఫ్యాన్స్ మన్మధరావు, క్రిష్ట, మహేష్ ఫ్యాన్స్ దున్న రాంబాబు, నాగార్జున ప్యాన్స్ ప్రసాద్‌లు విచ్చేయగా వారి చేతుల మీదుగా వేడుకలు జరిపారు.

అందరం మందుగుండు సామాన్లు కాల్చితిమి. ఈ సందర్భంగా మెగా అభిమానులు నానాజి, రంగ, రాజు, చంటి, గెంజిపేట శ్రీను, దుప్పడ చందు, మిమ్స్ శ్రీను, గోవిందు, రాము, కుమార్, చిన్నారావు, రమేష్ వందలాది అభిమానులు మధ్య 'సైం" సినిమా ట్రైలర్ వేడుకలు ఘనంగా జరిగినవి.

## నాటుసారా, అక్రమ మద్యం అరికట్టుటకై ప్రత్యేక దాడులు



పెద్దాపురం : పెద్దాపురం ప్రోహిబిషన్ & ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో నాటుసారాయి మరియు అక్రమ మద్యం అరికట్టులకై ప్రోహిబిషన్ & ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎంఆర్‌కె దాస్ ఆధ్వర్యంలో ప్రత్యేక దాడులు నిర్వహించడమైనది.ఈ దాడుల్లో గండేపల్లి మండలం గండేపల్లి గ్రామంలో పాలక నూకరాజు, సన్‌ఆఫ్ అచ్చయ్య అను వ్యక్తిని 5లీటర్ల సారాయితో మరియు మురారి గ్రామంలో కడవల వాసు, పైడి మళ్ళ వీర్రాజు అను ఇరువురు వ్యక్తులను ఒక్కొక్కరి వద్ద 5 లీటర్లు చొప్పున సారాయితో పట్టుకుని అరెస్టు చేయడమైనది. సదరు ముగ్గురి నుండి 15 లీటర్ల నాటు సారాయిని స్వాధీనపర్చుకుని సదరు ముగ్గురు వ్యక్తులపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు పంపించడమైనది. ఈ దాడుల్లో కె.తాతారెడ్డి, జె.విజయకుమార్, తదితర ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

## రామ్ ప్రసాద్ నాయక్‌కు రీసర్చ్ పీస్ అవార్డ్ 2019

**- అభినందించిన ఏయూ వీసీ ఆచార్య ప్రసాద్‌రెడ్డి**



రామ్ ప్రసాద్ నాయక్‌ను అభినందిస్తున్న వీసీ ప్రసాద రెడ్డి, డీన్ వెంకట రావు తదితరులు

ఏయూ : ఆంధ్రవిశ్వవిద్యాలయాన్ని జియో ఇంజనీరింగ్ విభాగం అధ్యాపకులు డాక్టర్ రామ్ ప్రసాద్ నాయక్ దేశావతుకు ప్రతిష్టాత్మకమైన రీసెర్చ్ పీస్ అవార్డు 2019 లభించింది. ఈ సందర్భంగా ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి తన కార్యాలయంలో రామ్ ప్రసాద్ నాయక్‌ను అభినందించారు. వర్సిటీ అధ్యాపకులు నూతన ఆలోచనలతో పనిచేయాలని సూచించారు. సమాజ సమసస్యలకు పరిష్కారాలు చూపే దిశగా పరిశోధనలు, ప్రాజెక్టులను నిర్వహించాలన్నారు. అవార్డులు మనపై బాధ్యతలు పెంపొందిస్తాయని, మరింత ఉత్సాహంతో పరిశోధన రంగంలో పనిచేయాలని సూచించారు. భవిష్యత్తులో మరిన్ని అవార్డులు సాధించాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. జియో స్పేషియల్ అప్లికేషన్స్-టెక్నాలజీస్ రంగంలో జరుపుతున్న వినూత్న పరిశోధనలు, అంతర్జాతీయ పరిశోధకునిగా గుర్తింపునిస్తూ రూలా అవార్డ్ సంస్థ ఈ అవార్డును అందించింది. వరల్డ్ రీసర్చ్ కౌన్సిల్, యునైటెడ్ మెడికల్ కౌన్సిల్‌తో సంయుక్తంగా రూలా అవార్డ్స్ ఈ కార్యక్రమాన్ని ఇటీవల చెన్నయ్‌లో నిర్వహించారు. సంస్థ ప్రతినిధులు డాక్టర్ రామ్ ప్రసాద్‌కు అవార్డును, ప్రశంసా పత్రాన్ని, మెడల్‌ను ప్రధానం చేశారు. కార్యక్రమంలో వర్సిటీ అకడమిక్ డీన్ ఆచార్య కె.వెంకట రావు, జియో ఇంజనీరింగ్ విభాగాధిపతి జి.జయశంకర్ తదితరులు పాల్గొని రామ్ ప్రసాద్ నాయక్‌ను అభినందించారు.

మొదటి పేజీ తరువాయి

## పడవ ప్రయాణాల్లో ప్రమాణాలు పాటించాలి

ఎదురయ్యే ప్రమాదాల గురించి పర్యాటకులకు అవగాహన కల్పించాలని, వాతావరణ పరిస్థితులను, ప్రమాదాలను గురించి హెచ్చరిస్తూ ఉండాలన్నారు. పర్యాటక ప్రదేశాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. టూరిస్ట్ లైసెన్స్ ఉన్న బోట్లను మాత్రమే యాత్రీకులు తీసుకుని వెళ్ళేలా సంబంధిత శాఖలు నిఘా నిర్వహిస్తూ ఉండాలన్నారు. పర్యాటకులను తీసుకువెళ్లే బోట్లకు కావలసిన నియమాలు, కట్టుబాట్లు, అవసరమైన పరీక్షలు మొదలైన వాటిని కచ్చితంగా అమలు చేయవలసిందేనని ఆదేశించారు. బోట్లను నియమిత కాలాల్లో తప్పక తనిఖీ చేయవలసిందేనని, అదే క్రమంలో పర్యాటకులకుఅవగాహన కల్పించాలని మంత్రి ఆదేశించారు.

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలో గల సముద్ర తీరాలు, నదీ ప్రాంతాలు పర్యాటక ప్రాంతాలను గూర్చి, అక్కడ అనుసరిస్తున్న విధానాలను గురించి సంబంధిత అధికారులతో మంత్రి క్షుణ్ణంగా సమీక్షించారు. పర్యాటక శాఖ ఆధీనంలో ఏ ఏ ప్రాంతాలు ఉన్నాయి ఎన్ని బోట్లు నడుస్తున్నాయి, వివిధ శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పర్యాటక ప్రాంతాలలో తీసుకున్న జాగ్రత్తలను గురించి అడిగి తెలుసుకున్నారు.

***మనం ఎంతటి మేధస్సును సాధించినా..***
***ప్రకృతి వ్యతిరేకతను ఎదుర్కోవడం కష్టం***
***జిల్లా కలెక్టరు వి.వినయ్ చంద్***

జిల్లా కలెక్టరు వి.వినయ్ చంద్ మాట్లాడుతూ గోదావరిలో జరిగిన పడవ ప్రమాదం సమన్వయ లోపం కారణంగానే జరిగినట్లు తెలియ వచ్చిందన్నారు. మనం ఎంతటి మేధస్సును సాధించినా.. ప్రకృతి వ్యతిరేకతను ఎదుర్కోవడం ఎంతో కష్టమని చెప్పారు. అధికారులు పోలీసులు పర్యాటకులను హెచ్చరిస్తూ ఉండాలని, ప్రజలు కూడా వారి ఆజ్ఞలను, సలహాలను పాటిస్తూ ఉండాలన్నారు. ఇటువంటి సంఘటన పునరావృతం కాకుండా చూసేందుకు తగిన ప్రణాళికలు రూపొందించేందుకే ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నేవీ కమాండ్ ఏవియేషన్ అధికారి కెప్టెన్ పంకజ్ రాయ్ పర్యాటక బోట్ల రకాలను గురించి, వాటి ప్రమాణాలను గురించి, నావికులకు సరంగులకు అవసరమైన శిక్షణ గురించి వివరించారు. నదీ మార్గాలకు సంబంధించి ఎంతటి శిక్షణ కలిగినవారయినను స్థానిక ఈతగాళ్ళు సరంగుల నుండి అనుభవ పూర్వకముగా మెలుకువలు తెలుసుకోవలసిందే నని నేవీ అధికారులు చెప్పారు.

ఈ సమావేశంలో డి ఐ జి రంగారావు, పోలీస్ కమిషనర్ ముఖేష్ కుమార్ మీనా, విఎంఆర్‌డిఏ కమిషనర్ కోటేశ్వరరావు, జీవీఎంసీ కమిషనర్ డా.జి.సృజన, జాయింట్ కలెక్టర్ ఎల్. శివ శంకర్, విశాఖ పోర్టు ట్రస్ట్ డిప్యూటీ చైర్మన్, మూడు జిల్లాల పర్యాటక శాఖ అధికారులు. మత్స్యశాఖ, భారత నావికా దళ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సచివాలయ ఫలితాలు విడుదల

నోటిఫికేషన్ ద్వారా 1,26,738 శాశ్వత ఉద్యోగాలు కల్పించడం చరిత్రలో ఇదే తొలిసారి. రికార్డు సమయంలో ఈ యజ్ఞాన్ని పూర్తి చేశాం. పరీక్షల్లో విజయం సాధించిన వారందరికీ మనస్ఫూర్తిగా అభినందనలు తెలియజేస్తున్నాను. ఎంపికైన వారికి మంచి శిక్షణ ఇస్తాం. వీరంతా ప్రజా సేవలో మమేకం కావాలి. అవినీతికి దూరంగా, నిష్పక్షపాతంగా పరీక్షలు నిర్వహించిన అధికారులకు అభినందనలు. అంకితభావంతో పరీక్షలు నిర్వహించి మంచి పనితీరును కనబరిచారు. అక్టోబర్ 2 నుంచి గ్రామ సచివాలయాలు అందుబాటులోకి వస్తాయి.

***సెక్రటేరియట్' ఫలితాలు: పూర్తి వివరాలు***

లక్షలాది మంది అభ్యర్థులు ఎంతో ఉత్కంఠగా ఎదురుచూస్తున్న సచివాలయ ఉద్యోగాల రాత పరీక్షల ఫలితాలు గురువారం మధ్యాహ్నం విడుదలయ్యాయి. రికార్డు స్థాయిలో ఒకే రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్ ద్వారా 1,26,728 మందిని ఎంపిక చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం పోటీ పరీక్షలు నిర్వహించడం విశేషం. ఈ మహోత్తర ప్రక్రియలో కీలక ఘట్టాలు, అంశాలను ప్రభుత్వం ప్రకటన రూపంలోమీడియాకు విడుదల చేసింది.

పరీక్ష ఫలితాలను గ్రామ సచివాలయం/ఆర్‌టీజీఎస్ వెబ్‌సైట్లో అభ్యర్థి హాల్ టికెట్ నెంబరు, పుట్టిన తేది ఆధారంగా తెలుసుకోవచ్చు

***ముఖ్యమైన అంశాలు***

ప్రభుత్వ సేవలను పారదర్శకంగా, అవినీతి రహితంగా ప్రజల గుమ్మం ముంగిటే అందచేయటానికి గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థ, గ్రామ/వార్డు వాలంటీర్ల వ్యవస్థలకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.

రాష్ట్ర ప్రభుత్వంచే ప్రతిష్టాత్మకంగా అమలు చేయబడుతున్న "నవరత్నాలు" కార్యక్రమం ద్వారా అందజేసే లబ్ధిని అర్హులైన కుటుంబాలకు చేర్చడానికి గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థల ఏర్పాటు ప్రతీసచివాలయంలో 11 నుంచి 12 మంది శాశ్వతప్రభుత్వ ఉద్యోగులను నియమించి, ప్రభుత్వ సేవల్లోనాణ్యత పెంపొందించే నిమిత్తంప్రభుత్వం మొత్తం 1,26,728(95,088 గ్రామీణ ప్రాంతాలలో, 36,410 పట్టణ ప్రాంతాలలో) ఉద్యోగాలనుకొత్తగా సృష్టించి, వాటిని పోటీ పరీక్ష ద్వారా నేరుగా ఎంపిక చేయటానికి 26.7.2019 న కామన్ నోటిఫికేషన్ విడుదల చేసాము క్రొత్తగా ఏర్పాటు చేసే గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థలుఅక్టోబర్ 2నుండి అమలులోకివస్తాయి. రాష్ట్రవ్యాప్తంగా 11158 గ్రామ సచివాలయాలను, 3786 వార్డు సచివాలయాలను ఏర్పాటు చేస్తున్నాము

***పరీక్షల నిర్వహణ విజయవంతం***

- తేదీ 1.9.2019 నుండి 8.9.2019 వరకు గ్రామ/వార్డు సచివాలయ సిబ్బంది ఎంపిక పరీక్షలను 6 రోజులపాటు విజయవంతంగా నిర్వహించడం జరిగింది.
- దేశ చరిత్రలోనే ఒకే రిక్రూట్ మెంట్ నోటిఫికేషన్ ద్వారా 1,26,728 మందిని ఎంపిక చేసేందుకు పోటీ పరీక్షలను ఒక రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించడం ఒక అరుదైన రికార్డు.

***- అభ్యర్థుల హాజరు:***

19 రకాలయిన పోస్టులను భర్తీకి 14 రకాల పరీక్షలకు మొత్తం 21.69 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. 19.50 లక్షల మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు అయినారు. పరీక్షలను ఎటువంటి పొరపాట్లు లేకుండా పూర్తి పారదర్శకతతో, నిష్పక్షపాతంగా నిర్వహించడం జరిగింది.

***పరీక్షా ఫలితాలు***

అభ్యర్థులను ఎంపిక చేయటానికి కనీస ఉత్తీర్ణతా మార్కులు. - ఓపెన్ కేటగిరీ అభ్యర్థులకు 40% - వెనుక బడిన తరగతులకు చెందిన వారికి 35%. - ఎస్‌సీ /ఎస్‌టీ /వికలాంగులకు 30%. హాజరైన 19,50,630 మంది అభ్యర్థుల్లో 1,26,728 ఉద్యోగాలకు 198164 మంది అభ్యర్థులు ఉత్తీర్ణులయ్యారు - ఓపెన్ కేటగిరి 24583.. - బీసీ కేటగిరి 100494.. - ఎస్‌సీ కేటగిరి 63629.. - ఎస్‌టీ కేటగిరి 9458.. - పురుషులు 131327.. - స్త్రీలు 66835. జరిగిన 14 పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన అభ్యర్థులు సాధించిన మార్కులు. ఓపెన్ కేటగిరిలో అత్యధికంగా 122.5 మార్కులు. బి.సి. కేటగిరిలో అత్యధికంగా 122.5 మార్కులు. ఎస్. సి కేటగిరిలో అత్యధికంగా 114 మార్కులు సాధించారు. ఎస్. టి కేటగిరిలో అత్యధికంగా 108 మార్కులు సాధించారు. మహిళా అభ్యర్థుల్లో గరిష్టంగా 112.5 మార్కులు. పురుష అభ్యర్థుల్లో గరిష్టంగా 122.5 మార్కులు. ఇన్ సర్వీస్ అభ్యర్థులకు 10% వెయిటేజ్ మార్కులు విడిగా కలపబడతాయి

ఫలితాల ప్రకటన అనంతరం, అర్హులైన అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్‌లను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి. తరువాత జిల్లా యంత్రాంగం ద్వారా తెలుపబడిన తేదిలలో నిర్ణీత ప్రదేశములకు వెళ్లి వారి సర్టిఫికేట్ లను తనిఖి చేయించుకోవలెను.

## 21నుంచి మోదీ అమెరికా పర్యటన

ప్రాంగణంలో మహాత్మా గాంధీ 150వ జయంతి ఉత్సవాల సందర్భంగా మోదీ 150 మొక్కలు నాటనున్నారు. ఈ కార్యక్రమంలో ఇండియా ప్రధానితో పాటు ఐక్యరాజ్యసమితి బృందం కూడా మొక్కలు నాటుతుంది. ఈ పర్యటనలో భాగంగా మోదీ ప్రముఖ పారిశ్రామికవేత్తలు, ప్రతినిధి బృందాలతో చర్చలు జరుపుతారు. 27న తిరిగి ఇండియాకు పయనమౌతారు.

## తేజస్‌లో ప్రయాణం ఓ కొత్త అనుభూతి




అమ్ములపొదిలో చేర్చిన విషయం తెలిసిందే. ఈ విమానానికి సంబంధించిన నౌకాదళ వెర్షన్ గతవారం కీలక పరీక్ష పూర్తిచేసుకుంది. 'అరెస్టెడ్ ల్యాండింగ్' అనే ప్రక్రియను విజయవంతంగా నిర్వహించడం ద్వారా విమానవాహక నౌకపై క్షేమంగా దిగే సామర్థ్యాన్ని ప్రదర్శించింది. దీంతో ఇలాంటి యుద్ధవిమానాన్ని రూపొందించే సత్తా కలిగిన అతికొద్ది దేశాల సరసన భారత్ చేరింది .

### నగరంలో హోర్డింగ్‌లు, పోస్టర్లు, బ్యానర్లు తొలగించండి

# స్వచ్ఛ విశాఖకు దోహదపడండి

- సుప్రీంకోర్టు తీర్పు.. మద్రాసు కేసు ఉదాహరణ
- ప్లాస్టిక్ వినియోగించినందుకు జరిమాన
- ప్రజాఫిర్యాదులకు ప్రాధాన్యతనివ్వండి
- ఓపెన్ స్పేస్‌లను స్వయంగా పరిశీలించండి
- జివిఎంసి కమిషనర్ డా.జి.సృజన



విశాఖపట్నం: విశాఖపట్నం నగరంలోని హోర్డింగ్‌లు, పోస్టర్లు, బ్యానర్లు తోలగించడం ద్వారా స్వచ్ఛ విశాఖకు దోహదపడడంతో బాటు ప్రజల సంక్షేమం పట్ల శ్రద్ధవహించాలని పేర్కోన్నారు. తన ఛాంబర్‌లో గురువారం పట్టణ ప్రణాళిక అధికారులతో ఆమె సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు.

సుప్రీం కోర్టు తీర్పు, ఇటీవల చెన్నై లో హోర్డింగ్ పడి మృతి చెందిన మహిళ కారణంగా హోర్డింగ్‌లను తక్షణ తోలగించాలని ఆదేశించారు. అదేవిధంగా గోడలపై పోస్టర్లు, కాగితాలు తోలగించి స్వచ్ఛ విశాఖకు దోహదపడాలని పేర్కోన్నారు. అదేవిధంగా ప్లాస్టిక్ బ్యానర్లు తోలగించడం, గుడ్డ బ్యానర్ల వినియోగాన్ని ప్రోత్సహించాలని అభిలషించారు. ప్లాస్టిక్ నిషేధం దృష్ట్యా ప్లాస్టిక్ బ్యానర్ల వినియోగించే వ్యక్తులు, సంస్థలకు జరిమాన విధించాలని ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో అధికారులు సిబ్బంది పర్యటించి అక్రమ కట్టడాలు, ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మాణాలను గుర్తించాలని కోరారు. వారానికి కనీసం పదికట్టడాలను గుర్తించి తనకు వివరాలు అందజేయాలని పేర్కోన్నారు.

అదేవిధంగా స్పందన, డయల్ యువర్ కమిషనర్, రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్‌ల నుండి వచ్చే ఫిర్యాదులు, సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి రెండు రోజుల్లో పరిశీలించి పరిష్కారమైతే పరిష్కరించడం లేకుంటే కారణాలు వ్రాత పూర్వకంగా తెలియజెప్పాలని ఆదేశించారు. పట్టణ ప్రణాళికా విభాగంలో నాలుగేళ్ళ ఆదాయంపై వివరాలు సమర్పించాలని కోరారు. ఓపెన్ స్పేస్ (ఖాళీ స్థలాలను) స్వయంగా పరిశీలించి జియోట్యాగ్ చేయాలని సూచించారు. బిపియస్ దరఖాస్తులను రెండు నెలల్లో పరిష్కరించాలని అభిలషించారు. పట్టణ ప్రణాళికా విభాగంపై ఎక్కువ ఫిర్యాదులు వస్తున్నాయని, ప్రజలకు చేరువగా నిష్పాక్షికంగా విధులు నిర్వర్తించాలని కోరారు.

సమావేశంలో సిసిపి విద్యుల్లత, డిసిపిలు ప్రభాకర్, రాంబాబు, ఏసిపిలు ఎస్టేట్ అధికారి సుబ్బారావు తదితరులు పాల్గోన్నారు.

# 6న జర్నలిస్టుల దసరా సంబరాలు

- మీడియా నియంత్రణపై రేపు శాంతియుత నిరసన ప్రదర్శన
- ఎ.పి. వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ కార్యవర్గ సమావేశంలో గంట్ల శ్రీనుబాబు




విశాఖపట్నం : ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, జిల్లా శాఖ ఆధ్వర్యంలో అక్టోబర్ 6న దసరా సంబరాలను అత్యంత ఘనంగా నిర్వహించనున్నట్లు జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, అర్బన్ అధ్యక్షులు పి. నారాయణ్‌లు తెలిపారు. గురువారం ఇక్కడ సీతమ్మధార వి.జె.ఎఫ్. వినోదవేదికలో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. తదుపరి వీరు మాట్లాడుతూ ప్రతిఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా దసరా సంబరాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు కార్యవర్గం నిర్ణయించిందన్నారు. వైశాఖి జలఉద్యానవనంలో పలు కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రఖ్యాత మెజీషియన్ రవిశంకర్ ఆధ్వర్యంలో మ్యాజిక్ షో కూడా ఏర్పాటు చేశామన్నారు. లక్కీడిప్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో అర్బన్, రూరల్ జిల్లా కార్యదర్శిలు అనురాధ, బి. ఈశ్వరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ ధవళేశ్వరపు రవికుమార్, జిల్లా ఉపాధ్యక్షులు ఎం.ఎ.ఎన్. పాత్రుడు, మధు, ఉపాధ్యక్షులు కామాకుల మురళీకృష్ణ, ఉదయ్‌కుమార్, ఎపిబిజిఎ అధ్యక్షులు ఇరోతి ఈశ్వరరావు, బొప్పాన రమేష్, చక్రవర్తి, ఇతర ప్రతినిధులు కృష్ణవేణి, రంగధామం తదితరులు పాల్గొన్నారు.

**రేపు శాంతియుత నిరసన ప్రదర్శన**

ఎ.బి.ఎన్, టి.వి-5 ఎలక్ట్రానిక్ మీడియా ఛానల్స్‌ను నియంత్రించడం సరికాదని కార్యవర్గం అభిప్రాయపడింది. ఇందుకు సంబంధించి సభ్యులంతా విపులంగా చర్చించారు. అనంతరం జర్నలిస్టుల ఫెడరేషన్ జాతీయ కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, పి. నారాయణ్‌లు మాట్లాడుతూ ఛానల్స్ నియంత్రణపై శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదురుగా జర్నలిస్టులతో శాంతియుత నిరసన ప్రదర్మన నిర్వహిస్తామన్నారు. తదుపరి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తామన్నారు. ప్రజాస్వామ్యంలో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరడం జరుగుతుందన్నారు. ఇప్పటికే తమ యూనియన్ రాష్ట్ర కార్యవర్గం పలువురు మంత్రులను కలసి వినతిపత్రాలు సమర్పించడం జరిగిందన్నారు.

తక్షణమే ఎ.బి.ఎన్, టి.వి.-5 ఛానల్స్ ప్రసారాలను పునరుద్దరించాలని సంబంధిత వర్గాలను ఫెడరేషన్ కోరుతుందన్నారు. శనివారం నిర్వహించనున్న జర్నలిస్టుల శాంతియుత నిరసన ప్రదర్మన జర్నలిస్టులంతా జయప్రదం చేయాలని వీరు పిలుపునిచ్చారు.

# పోతిన రమణబాబు విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి ముత్తంశెట్టి



మధురవాడః మహా విశాఖ నాలుగో వార్డు పరిధి బక్కన్నపాలెం గ్రామంలో దివంగత నేత మాజీ సర్పంచ్ పోతిన వెంకట రమణ బాబు నిలువెత్తు విగ్రహాన్ని గురువారం మంత్రి అవంతి ఆవిష్కరించారు, ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత నలభై సంవత్సరాలుగా ఈ ప్రాంత ప్రజల గుండెల్లో గుడి కట్టుకున్నారని కొనియాడారు, అలాగే మధురవాడ ప్రాంత అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని ఈయన విగ్రహ ఆవిష్కరణ తన చేతుల మీదుగా జరగడం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తి రెడ్డి మాట్లాడుతూ ఊరి నాయకుడిగా ప్రజల్లో ఒక్కడిగా, గ్రామ సర్పంచ్‌గా విశేష కృషి చేశారని, అనేక పదవులతో ఎన్నో సేవలందించిన గొప్ప నాయకుడని అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో రమణ బాబు కుమారుడు పోతిన నరసింహమూర్తి, కుటుంబ సభ్యులు 4, 5 వార్డుల వైకాపా అధ్యక్షులు బొట్ట అప్పలరాజు, పోతిన శ్రీనివాసరావు, పోతిన హనుమంతరావు, పోతిన శివ, సుమన్ వెంకట్రావు, పిళ్ల కృష్ణమూర్తి పాత్రుడు, పిళ్లా సూరిబాబు, గాదె రోసి రెడ్డి, అల్లాడి లింగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# అప్పన్నను దర్శించుకున్న సీబీ సీఐడి అశోక్ కుమార్



సింహాచలం: సింహాద్రిపై కొలువు తీరివున్న శ్రీ వరాహాలక్ష్మీనారసింహ స్వామివారిని అశోక్ కుమార్ ఐపీఎస్ సిబి సిఐడి గురువారం దర్శించుకున్నారు. సింహగిరికి చేరుకున్న వీరికి అలయ అధికారులు మేళతాళాలు మంగళవాయిద్యాల నడుమ ఘనస్వాగతం పలకగా . అర్చక స్వాములు ఆహ్వానం పలికారు. తొలుత కప్పస్థంభం ఆలింగనం చేసుకోగా స్వామివారికి తమ గోత్ర నామాలతో ప్రత్యేక పూజలు చేయించారు. దర్శనానంతరం వేద పండితులు ఆశీర్వచనం పలికారు. అలయ అధికారులు స్వామి వారి శేష వస్త్రంతో సత్కరించి తీర్ధ ప్రసాదలు అందజేశారు.

# అరకులోయ ప్రభుత్వాసుపత్రిలో వైద్య సిబ్బంది నిర్లక్ష్యం

- సౌకర్యాల లేమి, పరిశుభ్రత పాటించని సిబ్బంది
- అధికారులు చర్యలు తీసుకోవాలి



అరకులోయః అరకులోయ ఏరియా ఆసుపత్రిలో రోగులకు బెడ్ సీటుపైన పరుపు దుప్పట్లు లేదు. చిన్నపిల్లలను పరుపు దుప్పట్లు లేకుండానే బెడ్ పైన పడుకొబెడుతున్నారు. అప్పుడే పుట్టిన బాలింతలకు సైతం బెడ్ సీటుపైన పరుపు దుప్పట్లు లేకుండానే వైద్య సేవలు అందిస్తు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ, కనీస శుభ్రత లేకపోవడంతో పైన ఫోటో చూస్తే ఇట్టే అర్థం అవుతుంది.వైద్య సిబ్బంది, అధికారులు వీటిపై కూడా చర్యలు తీసుకొని, పరుపు దుప్పట్లు ప్రతి బెడ్ సీటులో ఉండేటట్లు చేయాలని స్థానికులు, వంతల.గురునాయుడు కోరుతున్నారు.


**ఈస్ట్ కోస్ట్ రైల్వే**

ఎలక్ట్రికల్ పని

ఇ-టెండరు ప్రకటన నెం. VSKP-EL-C-T-121E, తేదీ. 12.09.2019

**పని పేరు:** ఈస్ట్ కోస్ట్ రైల్వే, వాల్తేరు డివిజన్‌లో కొత్తవలస-కోరాపుట్ సెక్షన్ మధ్య డబ్లింగ్‌నకు సంబంధించి కొత్తవలస-శృంగవరపుకోట మధ్యన ఓవర్ హెడ్ కండక్టర్స్ తొలగించుట ద్వారా రైల్వే ట్రాక్‌పైన కి.మీ: 4/9-10 మరియు 6/15-16 వద్ద 33 కె.వి పవర్ లైను క్రాసింగ్స్ & కి.మీ 11/1-2 వద్ద 11 కెవి పవర్ లైను క్రాసింగ్ యొక్క మోడిఫికేషన్ మరియు పైపు పుషింగ్ పద్ధతితో భూగర్భ కేబుల్ చేయుట.

**సుమారు విలువ:** ₹ 88.06 లక్షలు, బయానా: ₹ 1,76,100/-, టెండరు డాక్యుమెంట్ ఖరీదు: ₹ 5,900/-, పని పూర్తి చేయు కాలం: 3 (మూడు) నెలలు

**టెండరు ముగింపు తేదీ మరియు సమయం:** 04.10.2019న 1200 గంటలకు

ఇందుకు సంబంధించి మాన్యువల్ ఆఫర్లు ఇ-టెండర్లకు సంబంధించి పోస్టు / కొరియర్ / ఫ్యాక్స్ లేదా స్వయంగా తమ సంస్థ లెటర్ హెడ్స్ పైన, సకాలంలో అందునట్లు పంపినప్పటికి అంగీకరించబడవు. అట్టి అన్ని మాన్యువల్ ఆఫర్లు చెల్లుబాటు కానివిగా పరిగణించవడతాయి మరియు ఎలాంటి పరిశీలన లేకుండానే తిరస్కరించబడతాయి.

పై ఇ-టెండరుకు సంబంధించిన పూర్తి సమాచారం ఇ-టెండరు డాక్యుమెంట్లతో పాటు http://www.ireps.gov.in వెబ్‌సైట్ నందు లభిస్తాయి.

సూచన: విశ్వసనీయ టెండరుదారులు ఈ టెండరుకు సంబంధించి ఏదైన మార్పులు / సవరణలు కోసం టెండరు ముగింపు తేదీకి 15 (పదిహేను) రోజులు ముందుగా ఈ టెండరును మరొకసారి చూడవలసినదిగా సలహానీయటమైనది.

చీఫ్ ఎలెక్ట్రికల్ ఇంజనీరు (Con), భువనేశ్వర్

PR-51/CC/19-20


# ఘనంగా వినాయక చవితి అన్నసమారాధన



విశాఖ సిటీ: 29వ వార్డు అల్లిపురంలోని యాత పేట రోడ్డులో గణేష్ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక చవితి అన్నసమారాధన లో విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ వినాయక చవితి సందర్భంగా అన్నసమారాధన ద్వారా ఎంతో మందికి ప్రసాదాన్ని పంపిణీ చేస్తున్న అసోసియేషన్ సభ్యులను అభినందించారు. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకురాలు, శ్రీ కనకమహాలక్ష్మి ఆలయ ట్రస్ట్ బోర్డు మెంబర్ గన గళ్ళ సత్యవతి మాట్లాడుతూ విశాఖ దక్షిణ నియోజకవర్గంలో జరుగుచున్న ఉత్సవాలకు ఎమ్మెల్యే వాసుపల్లి ఎంతో సహాయ సహకారాలు అందిస్తారని కొనియాడారు.

ఈ కార్యక్రమంలో బి. కొండలరావు మాట్లాడుతూ ప్రతి ఏటా తమ ప్రాంతంలో గణేష్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించి భక్తుల సౌకర్యార్థం అన్ని వసతులు కల్పించామన్నారు. ఈ అన్నసమారాధన లో అసోసియేషన్ సభ్యులు, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలను అందుకున్నారు.


చదవండి.. చదివించండి

**విజయభాను**


# 21న పాలిటెక్నిక్ కళాశాలలో మినీ జాబ్‌మేళా

### పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ జెవి.రామచంద్రరావు

నర్సీపట్నంః కౌశల్ గోదావరి, వికాస, నర్సీపట్నం గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజీ వారి ఆధ్వ్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం కోసం ఈ నెల 21వతేదీన మినీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు నర్సీపట్నం పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జివి.రామచంద్రరావు తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈ జాబ్ మేళాలో ప్రముఖ కంపెనీలైన ఆర్ఎస్ఎంఐపిఎల్ (ఫాక్స్‌కాన్) సంస్థలో మొదలైన టెక్నిషియన్, ఇండిగో ఎయిర్‌లైన్స్ సంస్థలో లోడర్స్, డ్రైవర్స్, హోండాయ్ మొబిన్, హోండాయ్, గ్లోవిస్, ఇంజి ఆటో కాంపోనెంట్స్, సుంగో, కెఎస్‌హెచ్, సియోన్, ఎస్‌విహెచ్, ఫరేషియా సంస్థలో టెక్నిషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు జరుగుతున్నాయని అన్నారు. దీనికి 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, డిప్లమో, ఐటిఐ(ఆల్ ట్రేడ్స్), బిటెక్ ఉత్తీర్ణులైన 18 నుండి 30 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న అభ్యర్థులు అర్హులన్నారు. వీరికి నెలకు రూ.9వేల నుండి రూ.16వేల వరకు జీతం, ఉచిత భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఉందన్నారు. ఆసక్తి గల నిరుద్యోగులు ఈ నెల 21వ తేదీ శనివారం నర్సీపట్నం పాలిటెక్నిక్ కళాశాల వద్ద ఉదయం 9 గంటలకు తమ బయోడేటా, సర్టిఫికెట్స్, జెరాక్స్, ఆధార్ జెరాక్స్ కాఫీలతో హాజరు కావాలని సూచించారు. మరెన్ని వివరాలకు 9182661825, 9440955619 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

# రెవెన్యూ సచ్చీకరణ సద్వినియోగం చేసుకోవాలి

### దుడ్డుపాలెంలో ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ



చోడవరంః ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రెవెన్యూ సచ్చీకరణ కార్యక్రమాన్ని రైతు సోదరులు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అన్నారు. మండలంలోని దుడ్డుపాలెం గ్రామంలో గురువారం రెవెన్యూ సచ్చీకరణ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూముల వద్దకు రెవెన్యూ అధికారులు వచ్చినప్పుడు రైతులు అందుబాటులో ఉండి సహకరించాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందికలగకుండా ఉండేందుకు రైతు వద్దకు వచ్చి క్షేత్రస్థాయిలో భూమి వివరాలు నమోదు చేసుకునేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో చోడవరం తహసీలల్దారు రవికుమార్, డి.టి, ఎం.రాజా, ఆర్.ఐలు రవి.రాంబాబు, స్థానిక వై.సి.పి నాయకులు కూరమదాసు మాలిబాబు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# డెంగ్యూపై గీతం ఎన్ఎస్ఎస్ చైతన్య ర్యాలీ




సాగర్‌నగర్ః ప్రమాదకర డెంగ్యూ జ్వరాలు, నివారణ చర్యలపై గీతం విద్యార్థులకు, అధ్యాపకులకు అవగాహన కలిగించడంలో భాగంగా గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో గురువారం చైతన్య ర్యాలీని నిర్వహించారు. ర్యాలీలో పాల్గోన్న రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.వి.జి.డి.బాలాజీ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతను పాటించడం, వర్షాకాలం పరిసరాలలో నిల్వనీరు ఉండకుండా జాగ్రత వహించడం ద్వారా డెంగ్యూ వ్యాప్తిని నియంత్రించవచ్చునని అన్నారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు డెంగ్యూ పై రుషికొండ పరిసరాలలో గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. కార్యక్రమంలో గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి.ధర్మరాజు, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాసు, ప్రోగ్రామ్ ఆఫీసర్‌లు పెద్దఎత్తున వాలంటీర్లు , పలువురు సీనయర్ ప్రొఫెసర్‌లు, విద్యార్థులు పాల్గోన్నారు.

### అప్పన్న అన్నదాన సత్రం ఈ ఓ ఆకస్మిక తనిఖీ



సింహాచలం: శ్రీ సింహాద్రి అప్పన్న అన్నదానం సత్రాన్ని సింహాచలం దేవస్థానం ఈ ఓ ఎం వెంకటేశ్వరరావు గురువారం ఉదయం ఇంజనీరింగ్ సిబ్బంది ఇతర అధికారులతో ఆకస్మికంగా తనిఖీ చేశారు .

ముందుగా అన్నదానం నుంచి డ్రైనేజ్ నుంచి దుర్గంధం వాసనకు అన్నదాన క్యూ లైన్లలో భక్తులు ఇబ్బంది పడుత ఉండటం గమనించి వెంటనే ఆ డ్రైనేజీ భవనం వెనకనుండి మల్లించమని అధికారులకు ఆదేశించారు. అంతేకాకుండా భోజనం అనంతరం భక్తులు బయటకు వచ్చే దారి ఇరుకుగా ఉండటంతో బయటకు వెళ్లే మార్గాన్ని బస్టాండు కు దగ్గరగా ఉండే మార్గానికి కలపాలని అన్నదాన సిబ్బంది మరియు భక్తుల కొరకు భవనం వెనుక వైపు మరుగుదొడ్లు నిర్మించాలని అధికారులకు ఆదేశించారు.

అనంతర బస్టాండు వద్దకు చేరుకొని డ్రైనేజ్ సిస్టంను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం డీ ఈ రమణ రాంబాబు, ఏ ఈ ఓ రాఘవ కుమార్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# మాల్స్, థియేటర్లు ఉచిత పార్కింగ్ ఇవ్వాలి




విశాఖపట్నం : షాపింగ్ కాంప్లెక్స్, సినిమా థియేటర్లు, మాల్స్‌లో వినియోగదారుల నుంచి అక్ర మంగా పార్కింగ్ వసూళ్లు చేస్తు న్నారని కన్స్యూమర్ రైట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, తెలంగాణ ఇంచార్జ్ వికాస్ పాండే అన్నారు. గురు వారం వీజేఎఫ్ ప్రెస్ క్లబ్ లో నిర్వ హించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను బేఖాతర్ చేస్తూ నిబంధనలను పాటించకుండా వాహనదారుల నుంచి అన్యాయంగా పార్కింగ్ ఫీజు వసూలు చేస్తున్నారని చెప్పారు. అన్ని చోట్లా అదే పరిస్థితి ఉందని తెలిపారు. రాష్ట్ర హైకోర్టు జీఓ విడుదల చేసినప్పటికీ వాహనదారుల నుంచి అడ్డంగా 20 నుంచి 40 రూపాయల వరకు వసూలు చేస్తున్నారని చెప్పారు. ఇందుకు సంబంధించి వస్తున్న ఫిర్యాదులపై తమ ఆర్గనైజేషన్ ప్రతినిధులు ఈ ఆదివారం 15న నగరంలో గల వరుణ్ ఐనాక్స్, చిత్రాలయా మాల్, సీఎం ఆర్ మాల్, అలాగే పలు సినిమా థియేటర్లు, కమర్షియల్ కాంప్లెక్స్‌లో పర్యటించి అక్కడ వాహనదారుల నుంచి వసూలు చేస్తున్న వ్యవహారాన్ని తెలుసుకోవడం జరిగిందన్నారు.

దీనిపై వారందరికీ తాము నోటీసులు అందజేస్తామని చెప్పారు. ఈ సమావేశంలో ఆర్గనైజేషన్ స్టేట్ జనరల్ సెక్రటరీ జి.శ్రీనివాస్ నాయుడు, విశాఖ సిటీ కన్వీనర్ ఇక్బాల్ జాఫర్, సెక్రటరీ ఎస్.వి.రవి కుమార్, సిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ విశ్వనాథ్, జిల్లా కార్యదర్శి ఎం.పి.రాజు తదితరులు పాల్గొన్నారు.

### అప్పన్న భూ పరిరక్షణ బాధ్యతలు చేపట్టిన స్పెషల్ డెప్యూటీ కలెక్టరు శేష శైలజ

సింహాచలం: సింహాచల దేవస్థానం భూ పరిరక్షణ విభాగం బాధ్యతలను స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ శేష శైలజ గురువారం ఉదయం బాధ్యతలను స్వీకరించారు. గత కొద్ది కాలం గా ఇక్కడే పనిచేసిన ఆమె ఫిబ్రవరిలో వేరే ప్రాంతానికి బదిలీ తిరిగి ఈరోజు మరల సింహాచలం దేవస్థానం భూ పరిరక్షణ విభాగం స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ బాధ్యతలను చేపట్టారు.

ఈ సందర్భంగా ఆమె మర్యాద పూర్వకంగా దేవస్థానం కార్యనిర్వాహణాధికారి వెంకటేశ్వర రావు ను కలిశారు. అంతరంగం అదే వస్తాను భూ పరిరక్షణ విభాగం సిబ్బంది అభినందనలు తెలిపారు.

# విజయభాను సంపాదకీయం

## ఇరానే దాడులు చేసింది

సౌదీ అరేబియాపై ఇటీవల జరిగిన డ్రోన్, క్షిపణిదాడుల వల్ల ఆ దేశంలోని చమురు క్షేత్రాలలో సగం ధ్వంసం కావడంతో పశ్చిమాసియాలో అమెరికా విధానాలు మరోసారి చర్చనీయాంశమయ్యాయి. ఈ దాడులు తామే చేశామని యెమెన్‌లోని హూతీ తిరుగుబాటుదారులు ప్రకటించారు. కానీ ఈ దాడులు ఇరానే చేసిందని అమెరికా, సౌదీ అరేబియా ఆరోపిస్తున్నాయి. ఇరాన్‌పై దాడి చేసినట్టు ఆధారాల కోసం వెతుకుతున్నామని ఈ విషయం ధ్రువపడితే ఆ దేశంపై దాడికి వెనుకాడబోమని కూడా అమెరికా అంటున్నది. కానీ ఇప్పటికే ఆఫ్ఘనిస్థాన్‌లో కూరుకుపోయిన అమెరికా ఇరాన్‌తో యుద్ధానికి దిగే దుస్సాహసం చేయకపోవచ్చు. అమెరికా సూచనల మేరకు యెమెన్ పోరాటంలో తలదూర్చిన సౌదీ అరేబియా కూడా ఆ రొంపి నుంచి బయటపడలేక తంటాలు పడుతున్నది. అందువల్లనే అమెరికా-సౌదీ అరేబియా వాదనలకు మిత్రదేశాల నుంచి మద్దతు లభించడం లేదు. జపాన్ మొదటినుంచి ఇరాన్‌తో మిత్ర సంబంధాలను సాగిస్తున్నది. సౌదీ అరేబియాపై దాడులను ఇరాన్ చేసినట్టు ఆధారాల్లేవని బ్రిటన్, ఫ్రాన్స్ ప్రకటించాయి. ఉద్రిక్తతలు పెరుగకుండా ఇరుపక్షాలు సంయమనం పాటించాలని జర్మనీ పిలుపునిచ్చింది. ఇరాన్ అణ్వాయుధాలు తయారుచేయకుండా నిరోధించడానికి కుదిరిన ఒప్పందం నుంచి అమెరికా వైదొలుగడాన్ని యూరప్ దేశాలు కూడా వ్యతిరేకించాయి. అయినా ట్రంప్ ఒప్పందాన్ని రద్దు చేసుకోవడమే కాకుండా, సౌదీ అరేబియా ద్వారా పశ్చిమాసియాలో పెత్తనం చెలాయించాలని ప్రయత్నించాడు. ఇప్పుడు ఏనుగు కుంభస్థలంపై దెబ్బ కొట్టినట్టు సౌదీ అరేబియా చమురు క్షేత్రాలపైనే దాడులు జరిగాయి. సౌదీ అరేబియాలో పేరుకు రాజు ఉన్నప్పటికీ రాకుమారుడు మహమ్మద్ బిన్ సల్మాన్‌దే పెత్తనం. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రోత్సాహంతో సల్మాన్ దేశంలోనే కాకుండా పశ్చిమాసియాలోనే దౌర్జన్యాలు సాగిస్తున్నాడు. దేశంలో తనకు గిట్టని రాకుమారులను కూడా జైలు పాలు చేశా డు లేదా హతమార్చాడు. విదేశాల నుంచి అపహరించి తెచ్చి కటకటాల పాలు చేశాడు. టర్కీలోని తమ రాయబార కార్యాలయంలో అసమ్మతివాది అయిన పాత్రికేయుడిని నమ్మకంగా పిలిపించి ఖండఖండాలుగా నరికించి సూట్‌కేసుల లో దేశానికి తెప్పించుకున్నాడు. లెబనాన్ అధ్యక్షుడిని బందీని చేసి, అంతర్జాతీయంగా వచ్చిన ఒత్తిడి మేరకు వదిలిపెట్టాడు. సల్మాన్ పెత్తనంలోని సౌదీ అరేబియా అమెరికా సలహా మేరకు యెమెన్ పోరాటంలో తలదూర్చింది. 2011లో అరబ్బు దేశాల్లో పాలకవ్యవస్థలపై తిరుగుబాట్లు చెలరేగినప్పుడు యెమెన్‌లో హూతీ తిరుగుబాటుదార్లు పాలకుడు అబ్ద్- రబ్బు మన్సూర్ హాదిని దేశం నుంచి పారదోలారు. సౌదీ అరేబియా పరారైన నాయకుడిని మళ్ళా ప్రతిష్ఠించడం కోసం యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌తో కలిసి యెమెన్‌లో సైన్యాలను దింపి హూతీలపై యుద్ధం మొదలు పెట్టింది. విమానదాడులతో హూతీలను తుడిచి పెట్టవచ్చని సౌదీ రాకుమారుడు భావించాడు. కానీ ఐదేండ్లయినా హూతీలదే పైచేయిగా ఉన్నది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ మెల్లగా యుద్ధం నుంచి జారుకుంటున్నది. కానీ సౌదీ అరేబియా విమానదాడుల వల్ల యెమెన్ అల్లకల్లోలమైంది. దాదాపు లక్షమంది మరణించారు. ప్రజలు ఆహారం, మందులు దొరుకక అల్లాడిపోతున్నారు. ఇరాన్ మద్దతు గల హూతీలు సౌదీ అరేబియాపై డ్రోన్, క్షిపణిదాడులు సాగిస్తున్నారు. ఎర్ర సముద్రాన్ని అరేబియా సముద్రంతో అనుసంధానం చేసే, నౌకా రవాణాకు కీలకమైన ఏడెన్ జలసంధిపై ఇరాన్ పట్టు పెరిగే అవకాశాలు ఏర్పడ్డాయి. అమెరికా ఇరాన్‌పై దాడులకు దిగితే పశ్చియాసియా అంత ఉద్రిక్తంగా ఉన్నందున, యుద్ధం ఎక్కడ మొదలైనా మొత్తం విస్తరించవచ్చు. చమురు ధరలు పెరిగి ప్రపంచదేశాలు ఆర్థికంగా కుంగిపోవచ్చు. సౌదీ అరేబియా బిలియన్ల కొద్ది డాలర్లు పెట్టి అమెరికా నుంచి ఆయుధాలు తెచ్చుకున్నది. అయి నా హూతీ తిరుగుబాటుదారుల నుంచి లేదా ఇరాన్ నుంచి చమురు క్షేత్రాలపై దాడులను అడ్డుకోలేక పోవడమే కాదు, కనీసం పసిగట్టలేకపోయింది. యుద్ధం అనుకున్నట్టు సాగదనడానికి ఇదొక ఉదాహరణ. తమకు నచ్చని దేశాలపై దాడులు చేసి అక్కడి పాలక వ్యవస్థలను కూల్చివేసినా, మళ్ళా అక్కడ అనుకూల ప్రభుత్వాలను నెలకొల్పడం సాధ్యం కాదని ఇరాక్, ఆఫ్ఘనిస్థాన్ తదితర దేశాల ప్రయోగాల ద్వారా తెలిసిపోయింది. విభేదాలను చర్చల ద్వారా పరిష్కరించుకోవలసిందే తప్ప యుద్ధాల ద్వారా కాదు. ఇప్పటికైనా అమెరికా తన విధానాలను మార్చుకుంటే తప్ప పశ్చిమాసియాలో శాంతి నెలకొనదు. యూరప్‌లోని మిత్రదేశాల హితవు మేరకు ఇరాన్‌తో చర్చలు జరిపి ఏదో మేర అంగీకారానికి రావాలె. సౌదీ అరేబియాలో నిరంకుశ పాలనకు మద్దతు ఇవ్వకూడదు. యెమెన్‌లో కూడా పోరాటం నిలిపివేసి శాంతి చర్చలు జరుపాలె. పశ్చిమాసియాలో సౌదీ అరేబియా మాదిరిగానే, దక్షిణా యాసియాలో తన అజెండాను అమలు చేయడానికి భారత్ ను సాధనంగా చేసుకోవాలని అమెరికా భావిస్తున్నది.

# ప్రభుత్వం 3 వేల కోట్లు కేటాయింపు

**వ్యవసాయం దండగ కాదు.. పండుగ అనేలా చేస్తాం**

**వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ ధరల స్థిరీకరణ సమావేశంలో**

**చోడవరం శాసన సభ్యుడు కరణం ధర్మశ్రీ**



చోడవరం: వ్యవసాయ ఉత్పత్తులు రైతులకు గిట్టుబాటు చేసేందుకు ప్రభుత్వ ధరల స్థిరీకరణకు 3 వేల కోట్లు కేటాయించడం జరిగిందని, వ్యవసాయంను నమ్ముకునే రైతు గిట్టు బాటు ధర కల్పించి వ్యవసాయం దండగ కాదు, పండుగ అనే విధంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చర్యలు తీసుకుంటున్నారని చోడవరం శాసన సభ్యుడు కరణం ధర్మశ్రీ అన్నారు. పట్టణంలోని ఖండిపల్లి రోడ్డులో గల వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో గురువారం ధరల స్థిరీకరణపై చోడవరం, మాడుగుల నియోజక వర్గ రైతులు, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మార్కెట్ కమిటీ జాయంట్ డైరెక్టర్ కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నవరత్నాలలో భాగంగా రైతు బరోసా చేపడుతున్నారన్నారు. రాష్ట్రంలో ప్రతి రైతు తాను పండించిన పంటకు గిట్టుబాటు ధర పొందేలా పెద్ద యెత్తున మార్పులు చేపడుతున్నారన్నారు. ఇందు కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా క్షేత్ర స్థాయిలో అధ్యయనం చేసి ఆయా ప్రాంతాలలో వచ్చిన సూచనల మేరకు చర్యలు చేపడతామన్నారు. రైతులకు సాగు నీరు అందించే చర్యలలో భాగంగా బోర్ వెల్స్ వేసేందుకు 200 రిగ్గులు అందుబాటులోకి తేనున్నారన్నారు. అలాగే పల్లం, మెట్ట ప్రాంతాలకు తగినట్టుగా అధిక దిగుబడినిచ్చే పంటలు వేసి, పండిన పంటలు సోలార్ కూలర్ స్టోరేజ్‌లు అందుబాటులోకి తేనున్నారు. ఇందుకోసం అవసరమైన చోట ప్రతిపాదనలు ఇవ్వాల్సిందిగా అధికారులకు సూచించారు. అలాగే చోడవరం పట్టణంలో ఉన్న రైతు బజారు లోని కొద్ది భాగాన్ని మార్కెట్ యార్డుకు అప్పగించి అభివృద్ధి చేసేలా చూస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మ పి.డి లీలావతి, ఉధ్యానవనశాఖ సహాయ సంచాలకులు శైలజా, వ్యవసాయ శాఖ ఏడిఎ, ఈ.ఆర్.ఎ.శ్రీనివాస్, వ్యవసాయాధికారిణిలు సత్యశ్యామల, సృజన, వై.సిపీ నాయకులు ఓరుగంటి నెహ్రు, బొడ్డు శ్రీరామమూర్తి, గూనూరు రామకృష్ణ, కలగర్ల శేషు మాడుగుల, చోడవరం మండలాలకు చెందిన అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# బృహద్ధమనికి అరుదైన శస్త్ర చికిత్స




విశాఖపట్నం: గుండెపోటు మరియు బృహద్ధమని వ్యాధులతో బాధపడుతున్న రోగిని మొదటిగా గుండెకు స్టంట్ వేసి చికిత్స చేయాలని ప్రముఖ డాక్టర్ హరివర్ధన్, డాక్టర్ వి. సుజాత ఇండస్ ఆసుపత్రి ఆవరణలో బృహద్ధమనిపై అవగాహన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హృదయం లోని ఎడమ జఠరికనుంచి బయటకు వచ్చి శరీరంలో వున్న అవయవాలను దెబ్బతీస్తాయని తెలిపారు. బృహత్‌ధమనిలో ఉబ్బు చీలికల్లో రెండు అతి ముఖ్యమైన వ్యాధులున్నను ప్రస్తుతం అధునిక విధానంలో మెరుగైన పరికరాలు ఇండస్ ఆసుపత్రిలో వున్నాయన్నారు. కోత, మత్తు వంటివి అవసరం లేకుండానే శస్త్ర చికిత్సలు చేపడుతున్నామన్నారు. నూతన అల్ట్రాసౌండ్ విధానం ద్వారా, ఐవిఎస్ ద్వారా నొప్పి లేకుండా చికిత్స నిర్వహిస్తామన్నారు.






# 22న చిత్రలేఖనం, ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు




విశాఖపట్నం : శంఖారావం అండ్ కల్చరల్ వెల్ఫేర్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 22న ఎల్‌కేజీ నుంచి 10వ తరగతి చదువు తన్న విద్యార్థులకు చిత్రలేఖనం, ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు బొమ్మిడి సత్యనారాయణ తెలిపారు. వీజేఎఫ్ ప్రెస్ క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ అసోసి యేషన్ 18వ వార్షికోత్సవం సంద ర్భంగా శివాజీ పాలెం సవేరా ఫంక్షన్ హాల్‌లో ఈ పోటీలు నిర్వహిం చను న్నామన్నారు. ఇతర వివరాలకు 98480 17499 నెంబర్ ను సంప్రదిం చాలని కోరారు.

ఈ సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు అప్పారావు, శివ ప్రకాష్, నరసింగరావు, షణ్ముఖ రావు, కె. త్రినాథ్, బొబ్బిలి రాజు, కె. సోములు, ఎస్.వి.ఎల్. నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు సినిమా చరిత్రలో ఏఎన్నార్ ఒక లెజెండ్

**కె.జి. హెచ్. సూపరింటెండెంట్ డా. జి. అర్జున**



విశాఖ సిటీః స్థానిక భూషణ్ బ్రదర్స్ కల్చరల్ ఆర్ట్స్ డా. అక్కినేని నాగేశ్వరరావు 96వ జయంతి వేడుకలను ప్రేమసమాజం ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న కె.జి. హెచ్. సూపరింటెండెంట్ డా. జి. అర్జున మాట్లాడుతూ నటనంటే అక్కినేనిదే - నటుడంటే అక్కినేని. పాత్రేదైనా ప్రాణం పోసి, ఒదిగిపోయి అద్యాయంగా మిగిలిన అక్కినేని నటేశ్వరరావు అని కొనియాడారు. మరొక అతిథి జి. ఎస్. కృష్ణమూర్తి మాట్లాడుతూ వెండితెర పాత్రలో వెలుగు హీరో డా. అక్కినేని అని తెలియపరిచారు. అలాగే ప్రత్యేక ఆహ్వానితులుగా విచ్చేసిన వి.యన్. మూర్తి మాట్లాడుతూ సినిమా నటులకు ఖ్యాతిని పెంచి, ఓనమాలకు క్రమశిక్షణలు నేర్పిన నటులు డా. అక్కినేని అని అన్నారు. ఫెడరేషన్ ఆఫ్ ఆర్టిస్ట్ డైరెక్టర్ సన్ మూర్తి మాట్లాడుతూ కృషి, పట్టుదల, దీక్షకి అక్కినేని పెట్టింది పేరని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో గాయనీగాయకులు ఫణిభూషణ్, సుబ్రహ్మణ్యం, భయ్యా శ్రీనివాస్, వెంకట్, కృష్ణంరాజు, వైజాగ్ రామకృష్ణ, వి.యన్.మూర్తి, భూపతిరావు, శశిరాణి, గిరిజా, యమునా, సత్యవతి, భాగ్యలక్ష్మి తమ గానంతో అభిమానులను ఆనందింపజేసారు. ఈ కార్యక్రమంలో సీనియర్ గాయనీమణి శశిరాణికి అక్కినేని ఆత్మీయ పురస్కారాన్ని అతిథులు చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో గురుస్వామి ఫణిస్వామి దంపతులు, గాయకులు అడ్వకేట్ ఎం.ఎస్. మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో 160 కిలోమీటర్ల మేర రెండు లైన్ల రహదారి

శ్రీకాకుళం: రాష్ట్రంలో 160 కిలోమీటర్ల మేర రహదారులను రెండు లైన్ల రహదారులుగా విస్త రణ చేయుటకు నిర్ణయించామని రాష్ట్ర ప్రభుత్వ రవాణా, ఆర్ అండ్ బి శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు తెలిపారు. జాతీయ రహదారి పనుల విస్తరణ, రహదారులు- భవనాల శాఖ పరిధిలో రహదారి పనులు, రవాణా శాఖ కార్యక లాపాలను పరిశీలించుటకు ముఖ్య కార్యదర్శి కృష్ణబాబు గురువారం శ్రీకాకుళం జిల్లాలో సందర్శించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాల యంలో సంబంధిత అధికారులతో సమీక్షించారు. రహదారులు, భవనాల శాఖ పరిధిలో రూ.350 కోట్లతో సింగిల్ వే రహదారులుగా ఉన్న రహ దారులను రెండు లైన్ల రహదారులుగా మార్చు టకు చర్యలు తీసుకున్నామన్నారు. జాతీయ రహదారి, ఓవర్ బ్రిడ్జి పనులకు ఎన్.టి.పి.సి విడుదల చేసే ఫ్లైయాస్ ను వినియోగించాలని సూచించారు. జాతీయ రహదారి విస్తరణ పనులలో సాగు నీటి కాలువలకు ఆటంకం లేకుండా నీటి పారుదల సజావుగా జరిగే విధంగా నిర్మాణాలు చేపట్టాలని ఆదేశించారు. జాతీయ రహదారి పనుల నిర్మాణంలో వివిధ శాఖల ద్వారా చేపట్టాల్సిన పనులపై సమావేశ మందిరం నుండే ఇపిడిసిఎల్ సి.ఎం.డి, గనుల శాఖ కార్యదర్శితో ఫోన్ లో మాట్లాడి సంబంధిత పనులు వెంటనే చేయుటకు చర్యలు చేపట్టాలని కోరారు. మందస హరిపురం 6 కిలోమీటర్ల రహదారిని రెండు లైన్ల రహదారిగా విస్తరించుటకు రూ.4 కోట్లతో మంజూరు జరిగిందని దానిని 4 లైన్ల రహదారిగా మార్చుటకు తిరిగి ప్రతిపాదనలు సమర్పించారని జిల్లా కలెక్టర్ నివాస్ తెలియజేయగా 2 లైన్ల రహదారిగా ప్రస్తుతం విస్తరించాలని ఆదేశించారు. గిరిజన ప్రాంతంలో కొన్ని రహదారులు టెండరు దశలో నిలిచిపోయాయని కలెక్టర్ తెలియజేయగా గిరిజన ఉపప్రణాళిక నిధులతో చేపట్టవచ్చని అందుకు ప్రతిపాదనలు సమర్పించాలని అన్నారు.

# ఏప్రిల్ 1 నుంచి నాణ్యమైన బియ్యం పంపిణీకి సన్నాహాలు

అమరావతి: ఏఫ్రిల్ 1వ తేదీ నుంచి ఏపీ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో నాణ్యమైన బియ్యం పంపిణీకి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఆ మేరకు చర్యలు తీసుకోవాల్సింగా అధికారులకు సీఎం జగన్ ఆదేశాలు జారీ చేశారు. గురువారం పౌరసరఫరాల శాఖపై క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి శ్రీకాకుళం జిల్లాలో అమలవుతున్న నాణ్యమైన బియ్యం పంపిణీపై ఆరా తీశారు. ప్రజల నుంచి మంచి స్పందన ఉందని అధికారులు చెప్పారు. ఏఫ్రిల్ 1 నుంచి అన్ని జిల్లాలకు వర్తింపు చేసేలా కార్యాచరణను సిద్ధం చేయాలని, ప్రజలు తినగలిగే నాణ్యమైన బియ్యాన్ని సేకరించేలా ఇప్పటి నుంచే ప్రణాళిక వేసుకోవాలని ఆదేశించారు.

## రాజధాని విషయంలో
# రాష్ట్ర ప్రభుత్వానిదే అంతిమ నిర్ణయం

అనంతపురం: ఏపీ రాజధాని విషయంలో రాష్ట్ర ప్రభుత్వానిదే అంతిమ నిర్ణయమని బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహరావు అన్నారు. ఈ విషయంలో తాము జోక్యం చేసుకోలేమని చెప్పారు. రాష్ట్రం హైకోర్టును రాయలసీమ ప్రాంతంలో ఏర్పాటు చేసే దిశగా సీఎం జగన్ చొరవ చూపాలని అన్నారు. వెనుకబడ్డ రాయలసీమ ప్రాంత అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో రైతులకు పూర్తి స్థాయి న్యాయం జరగాలన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ పెట్టుబడులు, నిర్మాణాలు పెద్దస్థాయిలో జరగలేదన్నారు. గత ప్రభుత్వం చేసింది తక్కువ, ఆర్భాటం ఎక్కువని ఎద్దేవా చేశారు. ఎంతోకొంత జరిగిందని, ఇప్పుడు మళ్లీ మొదట్నించి మొదలెట్టాలంటే కష్టమని.. ఇప్పుడు ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా, రాష్ట్ర ప్రజల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని నిర్ణయాలు తీసుకోవాలని జీవీఎల్ సూచించారు. కోడెల లాంటి వ్యక్తి ఆత్మహత్య చేసుకోవడం చాలా బాధాకరమని జీవీఎల్ అన్నారు. కోడెల మృతిపై రాజకీయ ఆరోపణలు చేయడం సరికాదని అన్నారు. సరైన పద్ధతిలో విచారణ జరిగితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని జీవీఎల్ అభిప్రాయం వ్యక్తం చేశారు.

గవర్నర్ కోర్టులో కోడెల మృతి వివాదం.. చంద్రబాబు సరికొత్త వ్యూహం.. టార్గెట్ ఎవరంటే ఏపీ మాజీ సీఎం, తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు కోడెల మృతితో పాటు, టిడిపి నేతలపై పెడుతున్న అక్రమ కేసులు గురించి ఏపీ గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ ను కలిసి ఫిర్యాదు చేశారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, ఆ పార్టీ నేతలు విజయవాడలోని రాజ్ భవన్‌లో గవర్నర్ ను కలిసి ఏపీలో నెలకొన్న పరిస్థితులపై ఆయనతో మాట్లాడారు. అధికారి వైసిపి రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణలో పూర్తిగా విఫలమైందని ఫిర్యాదు చేశారు. అంతేకాదు అక్రమ కేసులు బనాయిస్తూ తెలుగుదేశం పార్టీ శ్రేణులను భయభ్రాంతులకు గురి చేస్తుందని గవర్నర్ కు విన్నవించారు.ఈ సందర్భంగా 13 పేజీల నివేదికను అందజేసిన చంద్రబాబు గవర్నర్ తో కోడెల ఆత్మహత్యకు గల కారణాలను వివరించారు.

# కొత్త సచివాలం ఏర్పాటుకు గ్రామపెద్దలు, వాలంటీర్లతో సమావేశం

భీమునిపట్నం: భీమిలి మండలం కొత్త మూలకుద్దులో కొత్త సచివాలయం కోసం ఏర్పాటు చేయడానికి ఎం.పి.డి.ఓ పి వెంకట రమణ, డిఆర్డిఏ, వర్క్ ఇన్స్పెక్టర్ ఎ.ఇ, గ్రామ పెద్దలు వాలంటీర్లుతో సమావేశం ఏర్పాటు చేశారు. అక్టోబర్ 2వ తేదీన గ్రామ సచివాలయం ప్రారంభోత్సవం జరుగుతుందని వారు తెలిపారు. ఈ సమావేశంలో గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

**సొంత ఆటో, ట్యాక్సీ, మాక్సీ కాబ్‌లకు ఆర్థిక సహాయం**

సొంత ఆటో , ట్యాక్సీ, మాక్సీ కాబ్ లు కలిగి ఉన్న వారికి రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక సహాయం అందించుటకు నిర్ణయించిందని ముఖ్య కార్యదర్శి చెప్పారు. ఆర్థిక సహాయానికి ఆన్ లైన్‌లో మాత్రమే కాకుండా మాన్యువల్‌గాను దరఖాస్తు చేసుకునే విధానాన్ని అందుబాటులోకి తెచ్చామన్నారు. సొంత ఆటో, ట్యాక్సి, మాక్సీ క్యాబ్ ఉన్న వారు మాత్రమే అర్హులని ఆయన స్పష్టం చేసారు. కుటుంబంలో ఎవరి పేరు మీద ఉన్న ఆర్థిక సహాయానికి అర్హతను కలిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసామన్నారు. బ్యాంకు ఐ.ఎఫ్.ఎస్.సి నంబరు విధిగా ఉండాలని అందుకు లబ్దిదారుడు విధిగా షెడ్యూలు బ్యాంకులో ఖాతాను కలిగి ఉండాలని స్పష్టం చేసారు. సరిహద్దు రాష్ట్రాలలో డ్రైవింగు లైసెన్సు పొంది జిల్లాలో స్థానికత కలిగినవారిని కూడా అర్హులుగా గుర్తించాలని చెప్పారు. అటువంటి లబ్దిదారులు కేంద్ర రవాణా శాఖ ఆధ్వర్యంలోగల సారధి వెబ్ సైట్ లో చిరునామా మార్పుకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఇచ్ఛాపురం ప్రాంతంలో ఒడిషాలో డ్రైవింగు లైసెన్సు పొందిన వారికి ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసి వారి చిరునామాల మార్పుకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఆన్ లైన్ లో వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిశీలంచాలని కృష్ణబాబు ఆదేశించారు. లబ్దిదారుని పరిశీలన సులభతరం చేసామని పేర్కొంటూ లబ్దిదారుని పేరు, ఫోటో, చిరునామా అతను సమర్పించిన ఆధార్, డ్రైవింగు,వాహన రిజిస్ట్రేషన్ తదితర ధృవీకరణ పత్రాలతో సరిపోల్చాలని తెలిపారు. గ్రామ పంచాయతీ వారీగా ఎడిట్ ఆప్షన్ ను మండల అభివృద్ధి అధికారికి ఇస్తున్నట్లు ఆయన చెప్పారు.

జిల్లా కలెక్టర్ జె నివాస్ మాట్లాడుతూ శ్రీకాకుళం నగర పాలక సంస్థ పరిధి నుండి ఆమదాలవలస వెళ్లే రహదారి విస్తరణ అత్యావశ్యమని అందుకు రూ.33 కోట్లు అవసరమని అంచనా వేయడం జరిగిందని దానిని మంజూరు చేయుటకు చర్యలు చేపట్టాలని కోరారు. జిల్లాలో వరదలకు 95 కిలోమీటర్ల మేర రహదారి దెబ్బతిందని అందుకు రూ.4.72 కోట్లతో ప్రతిపాదనలు సమర్పించామని, బహుదానదిపై కవిటి ఈదుపురం వద్ద బ్రిడ్జి నిర్మాణానికి భూ సేకరణ చేయాలని అందుకు రూ.32 లక్షలు అసరమని వాటిని విడుదల చేయాలని కోరారు.

జాతీయ రహదారుల సంస్థ ప్రాజెక్టు డైరక్టర్ పి.శివ శంకర్ మాట్లాడుతూ రణస్థలం నుండి నరసన్నపేట వరకు 54 కిలోమీటర్లు మేర జాతీయ రహదారి పనులు జరుగుతున్నాయన్నారు. ఇందులో దాదాపు 10 కిలోమీటర్ల మేర వివిధ ప్రదేశాల్లో పనులు పూర్తి అయ్యాయని తెలిపారు. ఆ పరిధిలో 33 నిర్మాణాలు జరుగుతున్నాయని వివరించారు. నరసన్నపేట - ఇచ్ఛాపురం వరకు రహదారిలో 10 ఫ్లై ఓవర్ లు, 6 అండర్ పాస్ లు నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. ఇసుక లేదా ఫ్లై యాస్ 50 లక్షల క్యూబిక్ మీటర్ల వరకు ఫిల్లింగ్ కు అవసరం ఉందని పేర్కొన్నారు. సాగు నీటి ఛానల్స్ మళ్లింపుకు జలవనరుల శాఖతో చర్చించి తగు చర్యలు చేపడుతున్నామని అన్నారు. అవసరం మేరకు రిటైనింగ్ వాల్ నిర్మాణంకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. 51.54 హెక్టార్ల మేర భూ సేకరణ చేయాల్సి ఉందని తెలిపారు.

ఈ సమావేశంలో ఆర్ అండ్ బి చీఫ్ ఇంజనీరు డా.మనోహర్ రెడ్డి, డిప్యూటి ట్రాన్స్ పోర్టు కమీషనర్ డా.వడ్డి సుందర్, రెవిన్యూ డివిజనల్ అధికారులు యం.వి.రమణ, ఐ.కిషోర్, ఆర్ అండ్ బి పర్యవేక్షక ఇంజనీరు కె.కాంతిమతి, గనుల శాఖ ఉప సంచాలకులు ఎస్.కె. వి.సత్యనారాయణ, ఆర్ అండ్ బి, రవాణా, గనుల శాఖ, జాతీయ రహదారుల సంస్థ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోజుకి రూ. 25/- మాత్రమే Size 1x3 Minimum 7 days
విజయభాను క్లాసిఫైడ్స్
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 2564353, 2569004

### సంఖుపర్తి గ్రామములో పాఠశాలకు ఉపాధ్యాయుడుని పంపించాలని

## అధికారులకు గ్రామస్తులు వినతి



ఉపాధ్యాయుడు లేక మూతపడిన సంఖుపర్తి పాఠశాల

అనంతగిరి : అనంతగిరి మండలంలోని గుమ్మకోట పంచాయతీలో గల సంఖు పర్తి గ్రామములో, పాఠశాల కలదు. పాఠశాలలో 24 మంది పిల్లలు ఉన్నారు ఆ పాఠశాలకు ఉపాధ్యాయుడు వెళ్ళే దాకాలాలు లేవు పిల్లలు మధ్యాహ్నం వరకు ఉండి మధ్యాహ్నం భోజనం చేసి ఇంటికి వెళ్లి పోవడం జరుగుతుందని పిల్లల తల్లిదండ్రులు తెలుపుతున్నారు ఈ కారణంగా మా పిల్లలను మేము పనులు లోనికి తీసుకెళ్లి పోతున్నామని ఉపాధ్యాయుడు మాకు కనిపించని దాఖలాలు లేవని పిల్లల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇప్పటికైనా మండల అధికారులు స్పందించి పాఠశాలకు ఉపాధ్యాయుడు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని సంఖు పర్తి గ్రామ ప్రజలు పిల్తల తల్లి తల్లిదండ్రులు కోరుచున్నారు.



ఇంటివద్ద భోజనం చేస్తున్న విద్యార్థులు

### ఈనెల 21న ప్రముఖ సంఘ సంస్కర్త

## గురజాడ అప్పారావు 157వ జయంతి



విశాఖపట్నం : సెప్టెంబర్ 21 వ తేదీన ప్రముఖ సంఘ సంస్కర్త గురజాడ అప్పారావు నాయకులు 157 వ జయంతి సందర్భంగా ఐద్వా, ప్రజాసంఘాల నాయకులు 31 వ వార్డు న్యూకోలనీలో ఉన్న కమలా నెహ్రూ బాలికల పాఠశాలలో విద్యార్థినులతో గురువారం నాడు గురజాడ రచించిన "దేశమును ప్రేమించుమన్నా" దేశభక్తి గీతాన్ని పాడించి, ప్రతిజ్ఞ చేయించారు. ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్.యన్.మాధవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి కృష్ణ మెటర్నిటీ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ కె కమల గారు ముఖ్య అతిధిగా విచ్చేసి, ఐద్వా నిర్వహించిన ఉపన్యాసం, వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విద్యార్థినులకు మరియు పోటీలలో పాల్గొన్న వారందరికీ బహుమతులను స్పాన్సర్ చేసి ఈ రోజు కార్యక్రమంలో ప్రధానంచేసారు. అనంతరం జరిగిన సభలో సాహితీ స్రవంతి నగర అధ్యక్షులు ఏ.వీ.రమణరావు మాట్లాడుతూ సమాజంలో ఉన్న దురాచారాలు, మూఢవిశ్వాసాలపై గురజాడ తన కలాన్ని ఎక్కుపెట్టి ప్రజలను చైతన్యపరచారని అన్నారు. బాల్య వివాహాలు, సతీ సహగమనం, కన్యాశుల్కం పేరుతో మహిళలపై జరిగే దుర్మార్గాలను ధైర్యంగా ఎదిరించి వాటిని రూపుమాపడానికి ఎంతో కృషి చేసారని, తెలుగుభాష ఔన్నత్యాన్ని చాటిచెప్పే విధంగా ఎన్నో రచనలు చేసి ప్రజలలో అభ్యుదయ భావాలను కలిగించారని, అటువంటి మహానుభావులు చేసిన సంస్కరణోద్యమాల ఫలితంగానే మహిళలకు ఈమాత్రం స్వేచ్ఛ లభించిందని వారందరినీ రాబోయే తరాలు కూడా గుర్తుంచుకోవాలని అన్నారు. పీపుల్ ఫర్ ఇండియా నగర అధ్యక్షులు బీ.యల్. నారాయణ మాట్లాడుతూ గురజాడ గారు రచించిన "దేశమును ప్రేమించుమన్నా" గీతం ఎంతో అద్భుతమైనదని, ఈరోజులలో పాలకులు దేశంపట్ల అభిమానం నటిస్తూ ప్రజలను కష్టాలపాలు చేస్తున్నారని, స్వదేశీ పరిశ్రమలను మూతపెట్టి విదేశీ సరుకులతో మన మార్కెట్లను నింపుతున్నారని, దీనివలన దేశంలో చదువుకున్న యువతకు ఉద్యోగాలు తగ్గిపోతున్నాయని అన్నారు. గురజాడ వారసులుగా విద్య, ఉపాధి, రాజ్యాంగ హక్కుల రక్షణ, సమానత్వ సాధన కోసం ప్రతిఒక్కరూ ఉద్యమించాలని, సమాజ శ్రేయస్సు కోసం నడుంబిగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు ఆర్.యన్.మాధవి, పాఠశాల ఉపాధ్యాయులు స్వర్ణకుమారి, గ్లోరీ, రమణమూర్తి, అక్కయ్యపాలెం జోన్ సీఐటియూ నాయకులు కే.స్వతంత్రకుమార్, యం. ప్రదీప్‌కుమార్, బి.లక్ష్మీపతి, ఆర్.పీ. రాజు, పెద్దసంఖ్యలో విద్యార్థినులు పాల్గొన్నారు.

## సీతారాం సేవలు జివియంసి ఉద్యోగులకు గర్వకారణం



విశాఖపట్నం: జివియంసి ఉద్యోగిగా విధులు నిర్వహిస్తూ ఉద్యోగుల యూనియన్‌లో వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కీలక పదవిలో వుంటున్న డాక్టర్ గొండు సీతారాం బాలలకు అందిస్తున్న వినూత్న సేవలను గుర్తించిన ఏషియన్ ఎక్స్‌లెన్స్ అవార్డ్సు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో సీతారాం పేరు నమోదు కావడం యావత్ జివియంసి ఉద్యోగులకు గర్వకారణమని జివియంసి స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ సెక్రటరీ జనరల్ వి.వి.వామనరావు అన్నారు. గురువారం సింగ్ హోటల్ జంక్షన్‌లోని జివియంసి నాన్ పబ్లిక్ హెల్త్ కో-ఆపరేటివ్ సొసైటీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జివియంసి స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ కార్యవర్గ సభ్యులు, యూనియన్ సెక్రటరీ జనరల్ వి.వి.వామనరావుల చేతుల మీదుగా సీతారాంను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛాన్ని అందించారు. అనంతరం వి.వి.వామనరావు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు సామాజిక సేవలను అలవర్చుకున్నప్పుడే సంస్థకు, ఉద్యోగికి సమాజం అన్ని విధాలా ఆదరిస్తుందన్నారు. అదే కోవలో సీతారాం బాలలకు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివిగా ఉండడం వల్లే దేశస్థాయి ఆసియన్ ఎక్స్‌లెన్స్ అవార్డ్సు బుక్ ఆఫ్ రికార్డ్సులో నమోదు చేయడం ఉదాహరణగా కొనియాడారు. సీతారాంకు జివియంసి స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ అన్ని విధాలా ఆదరాభిమానాలతో ముందకు తీసుకువెళుతుందని భరోసా నిచ్చారు. సన్మాన కార్యక్రమంలో యూనియన్ నాయకులు జె.నరసింగ్, కె.ఎల్లయ్య, జి.వి.కుమార్, ప్రసాద్, వెంకట్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# చేతులు శుభ్రతే ఆరోగ్య భద్రత



సింహాచలం : 72 వ వార్డ్ పరిధి సింహాచలం విజినిగిరి పాలెం మండల పరిషత్ ప్రాథమిక పాటశాలలో గురువారం పాఠశాల ఉపాధ్యాయురాలు జి.ప్రసూన, కె.ఝున్సీ ఆధ్వర్యంలో విద్యార్థులకు చేతులు శుభ్రత పై అవగాహన కార్యక్రమం నిర్వ హించారు. ఈ సందర్భంగా స్మార్ట్ వార్డ్ కో-ఆర్డినేటర్ విజినిగిరి భాలభాను మూర్తి మాట్లాడుతూ ప్రాణాంతకమైన డెంగ్యూ, స్వైన్ ఫ్లూ వంటి వ్యాధుల బారిన పడకుండా స్వీయారోగ్య రక్షణ చర్యలు పాటించడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చున్నారు.

చేతులు శుభ్రతే ఆరోగ్య భద్రత అని.ప్రతి ఒక్కరూ చేతుల పరిశుభ్రతను విధిగా ఆచరించాలన్నారు. దగ్గు, జ్వరం, గొంతు నొప్పి, తలనొప్పి, వంటి రోగ లక్షణాలు మూడురోజులు తగ్గకపోతే వైద్యులను సంప్రదించాలని సూచిస్తు. సింహా చలంలో ఈ మధ్యే డెంగ్యూ జ్వరంతో ఒకరు మృతి చెందగా ఇప్పుడు విజినిగిరిపాలెం గ్రామంనకు చెందిన బస్వన.రమేష్ (30) అనే యువకుడు డెంగ్యూ బారిన పడి హాస్పిటల్ లో చికిత్స పొందు తున్నాడు. అందువలన పారిశుధ్యం సరైన నివారణ లేదు, ఫాంగింగ్ (పొగ వెదజల్లడం) జరగడం లేదు.వెంటనే జీవియంసీ వారు స్పందించాలని ఆయన కోరారు.

## బంగారుమెట్ట, పాటిపల్లి రోడ్డు నకు మోక్షం ఎప్పుడో?



అనంతగిరి : హుకుంపేట నుంచి పాటిపల్లి గ్రామంనకు రోడ్డుకు అనుకొని సుమారు100 గ్రామాలు ఉంటాయి. 5000 జనాభా ఉంటారు. ఈ రహదారి నుండి రెండు మండలాలకు చెందిన ప్రజలు రోజూ రాకపోకలు జరుపుతుంటారు. ఇటు హుకుంపేట, అటు అనంతగిరి మండలాల ప్రజలు మండల కేంద్రాలకు వెల్లాలంటే ఈ దారే గతి. ఇటు హుకుంపేట మండ లానికి సంబందించి గనికే, దిరపిల్లి గ్రామాలు మొదలు కొని, అటు అనంతగిరి మండలానికి చెందిన చివరి గ్రామలైన తునిసిబు, మద్రెభ, పాటిపల్లి గ్రామ ప్రజలు ఈ రోడ్డు నుండె రావాలి. మేము ఎన్నో పర్యాయాలు రాజకీయ నాయకులకు, ప్రభుత్వ అధికారులకు రోడ్డు గురించి పిర్యాదు చేసాము. కానీ ఎవరూ మా గోడు పట్టించు కోలేదు. ఏంతో మంది మోటార్ సైకిల్ ల నుండి జారిపడి హాస్పటల్ పాలు అవుతున్నారు. ఈ రోడ్డు లో ఎన్నో ప్రమాదాలు కూడా జరిగాయి. జరుగు తూనేఉంటున్నాయి అధికారులు ఇప్పటికైనా రోడ్డు మంజూరు చేయించి ప్రజలకు రోడ్డు కష్టాలనుంచి మోక్షం కలిగించాలని ప్రజలు కోరుతున్నారు.

## విద్యార్థులను జీవిత లక్ష్యాలను చేరుకునే దిశగా నడిపించండి

- సమాజ అవసరాలే పరిశోధనాంశాలు కావాలి
- నైతిక విద్యను అందించే బాధ్యత అధ్యాపకులదే
- ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి




అధ్యాపకులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి

ఆంధ్రాయూనివర్సిటీ : విద్యార్థులను జీవిత లక్ష్యాలను చేరుకునే దిశగా నడిపించే బాధ్యత అధ్యాపకులపై ఉంటుందని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి అన్నారు. గురువారం ఉదయం మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో నిర్వహించిన లైఫ్ సైన్సెస్‌లో రిఫ్రెషర్ కోర్సును ఆయన ప్రారంభించారు. అనంతరం అధ్యాపకులనుద్దేశించి మాట్లాడుతూ సమాజ అవసరాలు, సమస్యలే పరిశోధనాంశాలు కావాలని సూచించారు. విద్యార్థులకు నైతిక విద్యను అందించే బాధ్యత అధ్యాపకులదేనన్నారు. జాతీయ విద్యా ముసాయిదాలో క్రీడలు, వ్యాయామవిద్యలకు తగిన ప్రాధాన్యత కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

ప్రతిభావంతులైన విద్యార్థులు లైఫ్ సైన్సెస్ కోర్సులను అభ్యశించాలన్నారు. ఈ దిశగా విద్యార్థులను, సమాజాన్ని చైతన్యవంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కేవలం ఇంజనీరింగ్ విద్యకు ప్రాధాన్యత ఇవ్వడం ఎంతమాత్రం సమంజసం కాదన్నారు. పరీక్ష మార్కులు ప్రధానంగా పాఠశాల విద్య ఉండటం ఎంతమాత్రం సరికాదన్నారు. లైఫ్ సైన్సెస్‌లో ఎక్కువ మంది విద్యార్థులు ఆసక్తి చూపితే సమాజంలో సమతూకం ఏర్పడుతుందన్నారు. నేడు రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ కల్పిస్తోందని, దీనిని సద్వినియోగం చేసుకోవడం ఎంతో అవసర మన్నారు. ప్రతీ విద్యార్థి తన పూర్తి సమయాన్ని జ్ఞాన సముపార్జనకు వెచ్చించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వానికి, సమాజానికి జవాబుదారీగా విద్యార్థి నిలవాల్సిన అవసరం ఉంటుందన్నారు.

కార్యక్రమంలో కేంద్రం సంచాలకులు ఆచార్య పి.విశ్వనాథం, శిక్షణ కార్యక్రమం సమన్వయకర్త ఎస్.బి పడాల్, వి.లక్ష్మీ కల్పన తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో కేంద్రం సహ సంచాలకులు ఆచార్య ఎన్.ఏ.డి పాల్ తదితరులు పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేనిన అధ్యాపకులు రెండు వారాల శిక్షణ తరగతుల్లో పాల్గొంటున్నారు.

### పూలతో మరిడిమాంబ

## అమ్మవారి అలంకారం



అనకాపల్లి : పట్టణంలో కోట్ని వీధి మరిడిమాంబ అమ్మవారిని గురవారం పూలతో అలంకరించారు. ఈసందర్భంగా అమ్మవారిని తిలకించేందుకు పెద్ద ఎత్తున భక్తులు విచ్చేసారు. పువ్వుల అలంకరణ అందరినీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ చైర్మన్ అప్పికొండ రవిశంకర్, కోరుకొండ రాఘవ, ధర్మకర్తలు పందలి గణేష్, కోరుకొండ సంతోష్, కటారి దుర్గ, కోట్ని దొర, డి. శ్రీనివాస రావు, పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.



**వినాయక ఉత్సవాలలో భాగంగా తుమ్మపాల ఇందిరా నగర్‌లో గల వినాయకుడ్ని మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందసత్యనారాయణ దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన విరికి నిర్వాహకులు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నసమారాధనను మాజీ ఎమ్మెల్యే పీలా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొణతాల శ్రీనివాసరావు, రాపేటి రామ్‌కుమార్, నడిపల్లి గణేష్, స్థానికులు, స్థానిక యువకులు గ్రామపెద్దలు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.**

### వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో

## ఉచిత పశు వైద్య శిబిరం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

గొలుగొండ : నియోజకవర్గంలో ప్రతీ ఏడాది ఐదు ఉచిత పశు వైద్య శిబిరాలు నిర్వహిస్తామని వ్యవసాయశాఖ మార్కెట్ కమిటీ కార్యదర్శి ఎం.వెంకటేశ్వరరావు తెలియజేశారు. గురువారం గొలుగొండ మండలం పాకలపాడులో ఉచిత పశువైద్య శిబిరాన్ని పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ గణేష్ ముఖ్య అతిధిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ గణేష్ మాట్లాడుతూ ప్రభుత్వం నూతనంగా ఉచిత ఇన్స్యూరెన్స్ కల్పించిందని, రైతులు ఎవరూ డబ్బులు చెల్లించకుండానే ఇన్స్యూరెన్స్ వస్తుందన్నారు. అయితే దీనికి ముందుగా పశు యాజమాని ఆధార్ కార్డు నెంబరుతో నమోదు చేసుకోవాలన్నారు. మార్కెట్ కమిటీ కార్యదర్శి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఇటువంటి ఉచిత పశువైద్య శిబిరాలు వినియోగించుకోవాలన్నారు. ప్రతీ ఏటా సుమారు లక్ష రూపాయలు ఈ క్యాంపుకు నిర్వహిస్తుందన్నారు. నియోజకవర్గంలో ప్రతీ ఏడాది ఐదు క్యాంపులు నిర్వహిస్తామన్నారు. వైసిపి నాయకులు సుర్ల గిరిబాబు మాట్లాడుతూ రైతు పక్షపాత ప్రభుత్వంగా రైతుపక్షపాతి ప్రభుత్వంగా పేరు పొందిందన్నారు. నర్సీపట్నం ఎమ్మెల్యే ఉమాశంకర్‌గణేష్ సూచన మేరకే ఈ ప్రాంతంలో రైతులు ఎక్కువగా ఉండటం వల్ల ఇక్కడ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పాకలపాడు నుంచే కాకుండా చుట్టు పక్కల ప్రాంతాలనుంచి పాడి రైతలు అధికంగా పశువులను ఈ శిబిరానికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో గొలుగొండ, బూరుగుపాలెం వైద్యులు రమేష్, చరణ్, డెయిరీ ప్రతినిధులు, పాడి రైతులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ నిరోధానికి అందరూ సహకరించాలి

గొలుగొండ : ప్లాస్టిక్ నిరోధానికి అందరూ సహకరించాలని గొలుగొండ తహశీల్దార్ వెంకటేశ్వరరావు కోరారు. గురువారం గొలుగొండ నుండి జోగుంపేట వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జోగుంపేట సెంటర్‌లో మానవహారం నిర్వహించి ప్లాస్టిక్ నివారణపై ప్రజలు అందూ సహకరించాలని షాపు యాజమానులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వల్ల ఎన్నో అనార్ధలు ఉన్నాయని, కావున దీన్ని వాడకాన్ని నిలిపి వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు లెక్కల సత్యనారాయణ, గండెం ఈశ్వరరావు, అంగన్వాడీ కార్యకర్తలు, గ్రామ వాలంటీర్లు, ఐకెపి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.




## ఆయుష్మాన్ భారత్ పక్షోత్సవాలు సందర్భంగా విద్యార్థులకు రక్త పరీక్షలు

అన్నవరం : తూ.గో.జిల్లా అన్నవరం స్థానిక జూనియర్ కళాశాలలో ఆయుష్మాన్ భారత్ పక్షోత్సవాలు సందర్భంగా కళాశాల విద్యార్థిని,విద్యార్థులకు రావికం పాడు ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్యులు డా.సిహెచ్. యస్.వి.యస్ విక్రమ్ వైద్య సిబ్బందితో విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించారు.ఈ వైద్య పరీక్షలు నిర్వహించిన విద్యార్థులలో 60% బాలికలకు హీమో గ్లోబిన్ తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. హీమోగ్లోబిన్ తక్కువగా ఉన్న విద్యార్థులకు వైద్యాధికారి హీమోగ్లోబిన్ పెరుగుదలపై అవగాహన కల్పించి తగిన సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డొంకాడ గిరి మాట్లాడుతూ విద్యార్థులు అందరూ ఆయుష్మాన్ భారత్ కార్యక్రమాలను సద్వినియోగము చేసు కోవాలని కోరారు. ఈ కార్య క్రమాలు యన్.యస్.యస్.ప్రొగ్రామ్ ఆఫీసర్ ఘంటసాల.వెంకట్ ఆద్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో యన్.యస్.యస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ మాణిక్యాంబ మరియు వైద్య సిబ్బంది డి.ధనలక్ష్మి,భవాణి,దుర్గ,వరలక్ష్మి,ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



## ఎన్నాళ్లీ వేదన?

# కమలబంధ సాగిరివలస రోడ్డుకు మోక్షం ఎప్పుడో?....

ఎవరికైనా ఆరోగ్యం బాగోలేకపోతే ఏడు కిలో మీటర్ల దూరం డోలీలో రోగుల తరలింపు మేము పండించే అటవీ దినుసులు కావాడిలా ద్వారానే కాలినడకన నరకయాతన

మారుమూల గ్రామాలకు రహదారి సౌకర్యం లేక అవస్థలు



డుంబ్రిగుడ : ఏజెన్సీలో మారుమూల గ్రామాలకు రహదారి సదుపాయం లేకపోవడంతో అత్యవసర సమయాల్లో వైద్యసేవలు పొందడానికి గిరిజనులు కాలినడకన, లేదా డోలీల్లో ఆస్పత్రులకు చేరుకోవలసి వస్తోంది. ఆస్పత్రులకు చేరే వరకు వారి ప్రాణాలు నిలుస్తాయన్న నమ్మకం ఉండడం లేదు. ఇలా తరలించే సమయంలో రోగులతో పాటు వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు.అనేక మారుమూల గిరిజన గ్రామాల్లో ఈ పరిస్థితి నిత్యం ఎదురవుతోంది.

డుంబ్రిగుడ మండలం మారుమూల సొవ్వ పంచాయతీ పరిధిలో కమలబంధ, సాగిరివలస గ్రామాలకు గ్రావెల్ రోడ్డుకు 49లక్షల రూపాయలు సెంక్షన్ అయి, పనులు ప్రారంభించి బిల్లులు అవ్వలేదనే నేపంతో మధ్యలో ఆపేసారు.

రోడ్డు సౌకర్యం సరిగా లేనందువలన అత్యవసర పరిస్థితుల్లో మరియు వారపుసంతలో మేము పండించిన కూరగాయలు తరలించడానికి అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. తాము ఈ బాధలు భరించలేక పోతున్నామని, అధికారులు స్పందించి రహదారి సౌకర్యం కల్పించాలని ఆ రెండు గ్రామాల ప్రజలు మరియు .వై.సి.పీ నాయకులు వంతాల గురు నాయుడు కోరుతున్నారు.

# 120 కిలోల గంజాయి పట్టివేత



పట్టుకున్న గంజాయితో పోలీసులు

గొలుగొండ : చింతపల్లి నుండి ఆటోలో అక్రమంగా తరలిస్తున్న 120 కేజీల గంజాయిని పట్టుకున్నామని కేడిపేట ఎస్సై భీమరాజు తెలిపారు. ఆయన అందించిన వివరాల మేరకు చింతపల్లి మండలం పెల్లిమామిడి గ్రామానికి చెందిన పాంగి ధను, వంతల గోపాల్ వీరిద్దరు గురువారం ఆటోలో గంజాయిని తరలిస్తున్న సమయంలో కేడిపేట సమీపంలో ఉన్న అల్లూరి పార్కు వద్ద పట్టుకోవడం జరిగిందన్నారు. గంజాయితో పాటు ఆటో, ఒక సెల్‌ఫోన్ స్వాదీనం చేసుకున్నామని తెలిపారు. నిందితులను ఇద్దరిని కోర్టుకు తరలించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎస్సై రంగారావుతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యాకమిటీ ఎన్నికలపై అవగాహన



హాజరైన తల్లిదండ్రులు

మాకవరపాలెం : ప్రతీ తల్లిదండ్రులు విద్యా కమిటీ ఎన్నికల పట్ల అవగాహన కలిగి ఉండాలని స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎ.లక్ష్మణరావు అన్నారు. గురువారం పాఠశాలలో విద్యా కమిటీ ఎన్నికలపై తల్లిదండ్రులతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ 23వ తేదీ సోమవారం 1.30కు ఎన్నిక ప్రారంభం అవుతుందన్నారు. తరగతికి ముగ్గురు చొప్పున 15 మందిని ఎన్నుకోగా అందులో నుండి చైర్మన్, వైస్ చైర్మన్‌గా ఎన్నిక కాబడతారని చెప్పారు. పాఠశాలలో చదివే విద్యార్థుల తల్లి లేదా తండ్రి 23వ తేదీన ఎన్నికలకు హాజరు కావాలని కోరారు. ఎన్నికైన సభ్యులు, పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని, బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.ఉషారాణి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# 36 మంది వృద్ధులకు కళ్ళద్దాలు పంపిణీ



వృద్ధులకు కళ్ళద్దాలు పంపిణీ చేస్తున్న ఆర్మీ రిటైర్డు ఉద్యోగి కాళ్ళ కృష్ణ తదితరులు

చోడవరం : మండలంలోని గజపతినగరం గ్రామంలో ఆగష్టు 1న కాళ్ళ పవిత్రన్ జ్ఞాపకార్థం విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించి ఉచిత కంటివైద్య శిబిరం ధ్వారా చికిత్స పొందిన 36 మంది వృద్ధులకు గురువారం కళ్ళద్దాలను పంపిణీ చేశారు. వీటిని పవిత్రన్ తల్లిదండ్రులు, రిటైర్డు ఆర్మీ ఉద్యోగి కాళ్ళ కిష్ణ, పార్వతి చేతుల మీదుగా అందజేశారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎ.ఎస్.ఎస్. గోపాలాచారి చేతుల మీదుగా విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో శంకర్ ఫౌండేషన్ క్యాంప్ కోఆర్డినేటర్ అశ్వనీ కుమార్, ఉపాధ్యాయులు ఎన్.రమ, కొణతాల మహేశ్వరరావు, గజపతి నగరం, అంభేరుపురం, గోవాడ, గ్రామాలకు చెందిన వృద్ధులు పాల్గొన్నారు.

# కార్యకర్తలకు అండగా ఉంటా : మాజీ ఎమ్మెల్యే పీలా



అనకాపల్లి : తెలుగుదేశం పార్టీ కార్యకర్తలపై దాడులు చేస్తే క్షమించేది లేదని అనకాపల్లి మాజీ శాసన సభ్యులు పీలా గోవిందసత్యనారాయణ హెచ్చరించారు. మండలంలో బయ్యవరం గ్రామంలో బుధవారం రాత్రి వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీకి చెందిన పలువురు తెలుగుదేశంపార్టీ కార్యకర్త చామంతుల చరణ్‌పై దాడికి దిగారు. దీంతో చరణ్‌ను ఎన్టీఆర్ ఆసుపత్రిలో చేర్చించి వైద్య సేవలు అందిస్తున్నారు ఈసందర్భంగా చరణ్‌ను మాజీ శాసన సభ్యులు పీలా గోవిందసత్యనారాయణ, బిఎస్ఎంకే జోగినాయుడు మళ్ల సురేంద్ర, కాయల మురళీ తదితరులు గురువారం పరామర్శించారు. ఈసందర్భంగా గోవింద సత్యనారాయణ మాట్లాడుతూ బయ్యవరం గ్రామంలో తెలుగుదేశంపార్టీకి అత్యధిక మెజార్టీ రావడాన్ని జీర్ణించుకోలేక వైఎస్ఆర్‌పార్టీ నాయకులు దాడులకు దిగుతున్నారని ఆరోపించారు. కక్ష సాదింపులకు దిగితే సహించేది లేదన్నారు. దారి కాసి దాడి చేయడం చూస్తుంటే రాయలసీమ కక్షలు గుర్తుకు వస్తున్నాయన్నారు. ఇప్పటికీ కొత్త ప్రభుత్వ వచ్చిన తర్వాత కార్యకర్తలపై దాడులు చేయడం మూడవ సారని చెప్పారు. పోలీసులు దీనిపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇదే పద్ధతి భవిష్యత్‌లో కొనసాగితే ప్రతిఘటిస్తామని హెచ్చరించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# నూరు శాతం భూమి రికార్డ్ స్వచ్ఛీకరణ గ్రామసభ



ఆనంతగిరి : రాష్ట్ర ప్రభుత్వ అదేశాల మేరకు మండలంలో గల చిలకలా గెడ్డ గ్రామ పంచాయతీ వంకాయపాలెం గ్రామంలో నూరుశాతం భూమి రికార్డు స్వచ్చికరణ గ్రామసభ ఏర్పాటు చేసి రైతు యొక్క పట్టాదారు పాసు పుస్తకాలు సర్వే నంబర్లు సరిచేయడం మరణించిన రైతుల స్థానంలో వారసుల పేర్లు బదాలయిపు చేపట్టడం జరిగిందని గ్రామంలో నూరుశాతం భూమి రికార్డ్‌ను స్వచ్ఛీకరణ చేశామని తాశీల్దార్ వెంకటవరప్రసాద్ విలేకరులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ విఆర్ఓలు, విఆర్ఏలు రైతులు పాల్గొన్నారు.

# వైసీపీ 100 రోజుల పాలనపై జనసేన నివేదిక పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జనసేన నాయకులు

నాతవరం : జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ 100 రోజుల పాలనపై పారదర్శకత, దార్శినికత లోపించి వైసిపి 100 రోజుల పాలన జనసేన నివేదికపై ముద్రించిన పుస్తకాలను రైతులు, భవన నిర్మాణ కార్మికులతో కలిసి గురువారం ఆవిష్కరించినట్లు నర్సీపట్నం నియోజకవర్గ జనసేన నాయకులు రాజాన వీరసూర్యచంద్ర తెలిపారు. ఈ సందర్భంగా సూర్యచంద్ర మాట్లాడుతూ ఈ పుస్తకంలో ఇసుక విధానంలో జాప్యం, కుప్పకూలిన నిర్మాణ రంగం, డోలాయమానంలో ఆంధ్రప్రదేశ్ ఆర్థి కాభివృద్ధి, పడకేసిన ప్రజారోగ్యం, గృహనిర్మాణ పథకానికి గ్రహణం, అంతులేని అన్నదాన వ్యధ, సమస్యల సుడిలో సరస్వతీ నిలయాలు, పోలవరం నిర్మాణం జరగకపోవడం, రాజధాని నిర్మాణ పనులు ఎక్కడికి అక్కడే ఉండటం, ప్రభు త్వంలో ఉన్న మంత్రులే రోజకో రాజధాని పేరు చెప్పి అయోమయస్థితిలో ప్రజ లను ఉంచడం, సరైన ఇసుక పాలసీని ప్రభుత్వం తీసుకురాలేకపోవడం, అమ్మ ఒడి పథకంలో మీ ఇంటిలో ఉన్న పిల్లలను నేనే చదివిస్తా అని చెప్పి ఇప్పుడు ఇంటికి ఒకరినే అమ్మఒడి పథకంలో చేరుస్తామనడం, సెప్టెంబర్ 2 నుండి తెరుస్తా మన్న అన్న క్యాంటీన్‌లు ఇప్పటికీ తెరవకపోవడం, సెప్టెంబర్ 2 నుండి ఇంటింటికి రేషన్ బియ్యం వాలంటీరు ద్వారా చేరవేస్తామన్న ప్రభుత్వం ఏప్రిల్ 2020లో పంపుతామని చెప్పడం, సంక్షిప్తంగా సమస్యల చిట్టా ఈ పుస్తకంలో పొందుపరచడం జరిగిందన్నారు. ఈ పుస్తకంలు నియోజకవర్గంలో ఉన్నటు వంటి అన్ని గ్రామాలకు జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు చేరవేస్తారని తెలిపారు. ఈ కార్య క్రమంలో జనసేన నాయకులు పూడి చక్రవర్తి, గుడివాడ కృష్ణ, మంగాల భాస్కర్, ఎస్సీ సెల్ పి.పోతురాజు, చైన మురళీ, కిల్లాడ రమేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి



మాట్లాడుతున్న ఐకెపి జిల్లా అధ్యక్షులు చిలువూరి రూపాదేవి

కోటవురట్ల : కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని గురువారం కైలాసపట్నంలో జరిగిన సిఐటియు మండల మహాసభలో ఐకెపి జిల్లా అధ్యక్షులు చిలువూరి రూపాదేవి డిమాండ్ చేశారు. అనంతరం 26 మందితో మండల కమిటీ ఎన్నుకున్నారు. ఈ కమిటీలో అధ్యక్షులుగా ఆడారి లీలావతి, కార్యదర్శిగా టి.మాణిక్యంను, ఉపాధ్యక్షులుగా ఎం.సత్యవతి, సహాయ కార్యదర్శిగా పైలలక్ష్మిని గౌరవ అధ్యక్షుడిగా పి.వెంకటస్వామిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన సంఘం జిల్లా అధ్యక్షులు వై.ప్రసన్న, అంగన్వాడీ జిల్లా కమిటీ సభ్యులు భూకా పుష్పకుమారి, ఆశ వర్కర్స్ మండల అధ్యక్షులు ఎం.సత్యవతి, టి.మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

# చెరకు రైతుల సమస్యలు పరిష్కరించడం కోసం ప్రత్యేక గ్రీవెన్సు ఏర్పాటు



## షుగర్ ఫ్యాక్టరీ యండి వి.సన్యాసినాయుడు

చోడవరం : చోడవరం చక్కెర కార్మాగారంలోని రైతుల సమస్యలు పరిష్కరిం చేందుకు ప్రత్యేక గ్రీవెన్సు ఏర్పాటు చేసి తక్షణం సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తానని షుగర్ ఫ్యాక్టరీ ఎం.డి, వి.సన్యాసినాయుడు అన్నారు. ఇక్కడ పనిచేసిన ఎం.డి, కె.ఆర్. విక్టర్ రాజు భీమసింగ్ షుగర్ ఫ్యాక్టరీకి బదిలీకాగా, ఆయన స్థానంలో తాండవ షుగర్ ఫ్యాక్టరీ నుంచి గోవాడ షుగర్ ఫ్యాక్టరీ ఎం.డి,గా సన్యాసినాయుడు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సంద ర్భంగా ఫ్యాక్టరీ అధికారులు, కార్మికులు ఆయనకు పుష్పగుచ్ఛాన్ని అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది గోవాడ షుగర్ ఫ్యాక్టరీ 4 లక్షల 50 వేల టన్నుల చెరకు క్రషింగ్ లక్ష్యంగా ఏర్పాటు చేసుకున్నామన్నారు.

జనరల్ బాడీ ముందు రైతుల బకాయిలు చెల్లించేందుకు తన వంతు ప్రయత్నం చేస్తున్నానన్నారు. కార్మికులకు, కర్షకులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా కృషి చేస్తానన్నారు. అంతకు ముందు స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీని మర్యాదపూర్వకంగా తన నివాసంలో కలిసి ఫ్యాక్టరీ ఆర్థిక పరిస్థితిపై వివరించారు.

## రామునాయుడును అభినందిస్తున్న

## *అనకాపల్లి ఎంపీ భీశెట్టి సత్యవతి, విష్ణుమూర్తి దంపతులు*

### ఏ.పి.ఎల్ కోపరేటివ్ షుగర్ ఫ్యాక్టరీ ఫెడరేషన్ జనరల్ శెక్రటరీగా శరగడం రామునాయుడు



చోడవరం : ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఆల్ కో-ఆపరేటివ్ షుగర్ ఫ్యాక్టరీస్ ఫెడరేషన్ జనరల్ శెక్రటరీగా గోవాడ షుగర్ ఫ్యాక్టరీ వర్కకర్సు యూనియన్ నాయ కులు శరగడం రాము నాయుడు గురువారం ఎన్నిక య్యారు. రాష్ట్రంలో గల అన్ని సహకారం సంఘాల నాయకులు రాము నాయుడును ఏక గ్రీవంగా ఎన్నికున్నారు. ఈ సందర్భంగా అనకాపల్లి ఎం.పీ భీశెట్టి సత్య వతి, విష్ణుమూర్తి దంప తులు, ఫ్యాక్టరీ అధి కారులు, కార్మి కులు శ్రేయోభిలాషులు రాము నాయుడును అభినందించారు.

# అభివృద్ధికి ఆమడ దూరంలో గిరిజన గ్రామాలు

**- త్రాగునీరు,రోడ్డు,పాఠశాల లేక ఇబ్బందులు - వైద్య సదుపాయం అందటంలేదు - అధికారులు గ్రామాలలో తొంగిచూడలేదు**



అనంతగిరి : మండలంలో మారుమూల పంచా యతీ అయిన గుమ్మ పంచాయతీ లోగల కడరేవు, కర్రిగూడ, బురుగుపాడు మద్ది గారువు, మూల దుంగడా గ్రామా లలో ఇప్పటికి ప్రభుత్వ పథ కాలకు నోచుకోక గ్రామాలు అభివ ృద్ధికి దూరంగా గిరిజనులు చీకటిలోనే మగ్గుతున్నారు. గ్రామా లలో ఇటువంటి అభివృద్ధి లేక బాహ్య ప్రపంచానికి చాలా దూరంలో ఉన్నారు. వారి తాత్తముత్తాత కాలం నుండి అక్కడి జీవిస్తున్న ఇప్పటికి ఆయా గ్రామాలలో త్రాగునీరు, రోడ్డు, పాఠశాలలు, అటవీ పట్టాలు వంటి పథకాలు అందక గిరిజనులు నానా అవస్థలు పడుచున్నారు.అలాగే 2005, 06 అతవిహక్కుల చట్టప్రకారం 2005 సం,,పూర్వము నుండి సాగుచేస్తున్నప్పటికి ఇప్పటికి పట్టాలు మంజూరు చేయకపోవడం బాధా కరమని, ఆయా గ్రామాలు పంచా యితీ కేంద్రమునుండి సుమారుగా 20 కి.మీ దూరం కొండపైన ఉండడంతో అధికారులు ఆరోగ్య కార్యకర్తలు ఏనాడు సందర్శించిన దాఖలు లేక అన్నిరకల ఇబ్బందులకు గురి అవుతున్నామని ఆయా గ్రామాలలో పాఠ శాలలు లేక పిల్లలకు అడవిధారంట 4కి,,మీ దూరంలో పాఠశాలకు వెల్లవలసి వస్తుందని గ్రామంలోనే కొత్త పాఠశాల మంజూరుచేసి చేయాలని అలాగే పై నా తెలిపిన అన్ని సమస్యల పైన అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా అధికారులుపట్టించుకోవటంలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటికైనా మా గ్రామాలకు, పాఠశాల, త్రాగునీరు, సౌకర్యాలు కల్పిం చాలని గ్రామస్థులు అధికారులను కోరుచున్నారు,

# రహదారి భద్రత అందరి భాద్యత

విశాఖపట్నం : గాజువాక హెచ్.పి.సి.ఎల్ లో డ్రైవర్లకు రహదారి భద్రతా పైన గురువారం అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప రవాణా కమిషనర్ జి.సి. రాజారత్నం, డివిజినల్ మేనేజర్ రమణ మూర్తి తదితరులు పాల్గొన్నారు. డి.టి.సి. జి.సి. రాజారత్నం డ్రైవర్లకు హజార్డాస్ వాహనములు నడిపేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి, ముఖ్యంగా భారీ వాహనములు నడిపేటప్పుడు ప్రమాదాలు ఎక్కువగా రాత్రి సమయంలో ప్రమా దాలు జరుగు తుండడం పరిపాటి అయతే రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఉండేందుకుమెలుకవలను ఈ అవగాహన సదస్సు వివరించారు.

# వ్యాయామ ఉపాధ్యాయుల ధర్నా




కాకినాడ: వ్యాయమ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వ్యాయామోపాధ్యాయ జిల్లా సంఘం ఆధ్వర్యంలో గురువారం కాకినాడ కలెక్టరేట్ వద్ద ధర్నా జరిగింది.ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు వి.రవిరాజ్ మాట్లాడుతూ వ్యాయమ ఉపాధ్యాయులు పదోన్నతులు లేక సెకండరీ గ్రేడ్ వేతనాలతో పనిచేస్తున్నారన్నారు. జిల్లాలో2,603 పిఈటీలను క్రమబద్దీకరించాలన్నారు. గత సంవత్సరం ఖర్చు పెట్టిన 63 లక్షల సీఎం కప్ నిధులు తక్షణం విడుదల చేయాలని కోరారు. ఉన్నత పాఠశాలల్లో క్రీడా పరికరాలకు నిధులు ఇవ్వాలని, డిగ్రీ అర్హత కలిగిన పిఈటీ లకు వేతనం తో కూడిన ఇన్ సర్వీస్ బీపి ఈ డీ కోర్స్ కు అనుమతి ఇవ్వాలన్నారు. ఎయిడెడ్ పాఠశాల లో పిఈటీ ల పోస్టులు ఉన్నతీకరించాలని, విద్యార్థుల సంఖ్యను బట్టి వ్యాయమ ఉపాధ్యాయుల ఖాళీలు భర్తీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఎల్. జార్జ్, కోశాధికారి జి. సునీల్ కుమార్, సహ కార్యదర్శి బి వి వి ఎస్ ఎన్ మూర్తి, సురేష్ బాబు, సంఘ సభ్యులు, పిఈటీ లు పాల్గొన్నారు.

## ఇళ్ళ మధ్య బ్రాందీ షాపు వద్దని ఫిర్యాదు

భీమునిపట్నం: తగరపువలస డివిజన్ ఏడవ వార్డ్ ఫుట్ బాల్ గ్రౌండ్ ఆనుకొని ఉన్న ఇళ్ళ సముదాయము ల మద్య, అలాగే కాలేజ్ లకు దగ్గర లో బ్రాందీ షాపు పెట్టడానికి అనుమతి ఇచ్చారని, దానిని నిలుపుదల చేయాలని అక్కడ వున్న మహిళలు, భీమిలి ప్రొహిబిషన్ కార్యాలయంలో పిర్యాదు చేశారు.

# తెలుగు మాధ్యమాల దినోత్సవం

భీమునిపట్నం: స్థానిక రాయిప్పాలెం జీ.వి.ఎం.సి పాటశాల హెచ్.ఎం.రెడ్డిపల్లి.అప్పలరాజు అద్వర్యంలో తెలుగు మద్యమాల దినోత్సవం ఘనంగా జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు మద్యమాల లో వాడుక బాషను విజయవంతంగా ప్రేవేశ పెట్టిన తాపీ దర్మారావు గుర్తుగా ఆయన జన్మదినం రోజున ఈ దినోత్సవం జరుపుతారని పత్రికలు,రేడియో,టెలివిజన్,పేస్ బుక్ మొదలైనవి మధ్యమాలలో ఉన్నాయని.దేశం లో మరే బాషలో లేనన్ని వార్తా చానల్ లు పత్రికలు తెలుగులో ఉన్నాయని తెలుగు బాషా పండితుడు తాపీ ధర్మారావు ప్రజల బాషను గౌరవించి తొలిసారిగా 1936 లో జనవాణి పత్రికలో వాడుక బాషలో పెట్టడం జరిగిందని తెలియజేసారు.ఈ కార్యక్రమం లో గ్రేస్ లిల్లీ,సౌమ్య శ్రీ ,రుక్మిణి సి ఆర్ పి వంశీదర్ తదితరులు పాల్గొన్నారు.

# అక్టోబర్ 2వ తేదీన గ్రామ సచివాలయం ప్రారంభోత్సవం

భీమునిపట్నం: భీమిలి మండలం కొత్త మూలకుద్దులో కొత్త సచివాలయం కోసం ఏర్పాటు చేయడానికి ఎం.పి.డి.ఓ పి వెంకట రమణ, డిఆర్డిఏ, వర్క్ ఇన్స్పెక్టర్ ఎ.ఇ, గ్రామ పెద్దలు వాలంటీర్లు తో సమావేశం ఏర్పాటు చేశారు. అక్టోబర్ 2వ తేదీన గ్రామ సచివాలయం ప్రారంభోత్సవం జరుగుతుందని వారు తెలిపారు. ఈ సమావేశంలో గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# అధికారులను వేధిస్తే సహించేది లేదు

### ఏపీ మాల ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు నక్కా

కాకినాడ : జిల్లాను ప్రగతి పధం వైపు నడిపిస్తున్న అధికారులను వేధింపులకు గురి చేస్తే సహించేది లేదని రాష్ట్ర మాల ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు నక్కా రాజశేఖర్ హెచ్చరించారు. మాల మహానాడు జాతీయ అధ్యక్షునిగా చెప్పుకొంటున్న ఆర్ఎస్.రత్నాకర్ తన వైఖరి, దూషణ మాటలకు స్వస్తి పలకాలని హితవు పలికారు.ఈసందర్భంగా రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు.జాతీయ మాల మాహానాడు నాయకునిగా ఎంత మంది పేదవాళ్లకు న్యాయం చేసారో చెప్పాలని డిమాండ్ చేసారు.అధికారులపై పెత్తనం చెలాయిస్తూ దందాలకు పాల్పడితే సహించేదిలేదని హెచ్చరించారు.నిజాయితీకి నిలువుటద్దంలా పని చేస్తున్న జిల్లా కలెక్టర్ మురళీధర్‌రెడ్డి,జాయింట్ కలెక్టర్ -2 రాజకుమారి, డిఆర్వో సత్తిబాబు, పీడీ మల్లిబాబు,ఎస్సీ కార్పొరేషన్ ఈడి సునీత తదితర జిల్లా అధికారులపై ఒత్తిడి చేస్తే చూస్తూ ఊరుకోమని బహుజన హక్కుల పోరాట సమితి అధ్యక్షులు జగడం రాజబాబు(కాకినాడ సిటి) హెచ్చరించారు.కులం పేరు చెప్పుకొని అధికారులను బెదిరిస్తున్న వ్యక్తులపై తోన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు.

# వైజాగ్ క్విస్ట్ పత్రికను విడుదల చేసిన ఉక్కు సి.యం.డి రథ్



గాజువాక: ఆర్ఐఎన్ఎల్-విశాఖ ఉక్కుకర్మాగారం సోదరభావం యొక్క అంతర్గత సాంకేతిక వార్షిక పత్రిక వైజాగ్ క్విస్ట్‌ను సంస్థ సి.యం.డి పి.కె.రథ్ విడుదల చేసారు. ఉక్కునగరంలో తన స్వగృహంలో గురువారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో పత్రికను విడుదల చేసి పి.కె.రథ్ మాట్లాడుతూ పత్రిక సంపాదకీయ బృందాన్ని ఆయన అభినందించారు. వైజాగ్ క్విస్ట్ థీమ్ బేస్డ్ యొక్క భవిష్యత్ సమస్యలను బయటకు తీసుకురావాలని వారికి సలహా ఇచ్చారు. ఇనుము, ఉక్కు పరిశ్రమతో అనుసంధానించబడిన తాజాపోకడలు, సాంకేతికత, పారిశ్రామిక సమస్యలను పాఠకులకు సులభంగా అర్థం చేసుకోవడానికి సరళమైన భాషలో హైలైట్ చేసారన్నారు. ఇండస్ట్రీలో జ్ఞానం, అనుభవాలు, తాజాజ్ఞానం, ఆవిష్కరణలను చూపించడానికి అన్ని సాంకేతిక విభాగాల సీనియర్ అధికారులతో కూడిన సంపాదకీయ బృందం ఈ పత్రికను నడుపుతుందని అన్నారు. ఐరన్, స్టీల్ తయారీ, ఐరన్ అండ్ స్టీల్‌రంగంలో అనుబంధ పక్రియలలో చాలా మార్పులు వచ్చాయని అన్నారు. 2019 వైజాగ్ క్విష్ట్ మొదటి సంచిక కోక్ ఓవెన్స్ నుంచి రోలింగ్ మిల్స్ వరకు విభిన్న ప్రాంతాలలో పద్దెనిమిది పేజీలతో ప్రారంభించబడిందని, వైజాగ్ స్టీల్‌లో ఎదుర్కొన్న ప్రక్రియ, ఉత్పత్తి, పర్యావరణ మెరుగుదలలతో అనుసంధానించబడిన పత్రాలను కల్గి ఉందన్నారు. ఇందులోని అంశాలు, విలువైన సమాచారం అంతర్గతంగానే కాకుండా తోటి ఉక్కు పరిశ్రమ సహచరులు, భారతదేశంలోని విద్యాసంస్థలతో కూడా పంచుకోవడం దీని లక్ష్యం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉక్కు డైరెక్టర్లు వి.వి.వేణుగోపాల్‌రావు, డి.కె.మహంతి, కె.వి.విద్యాసాగర్, ఎన్.కె.నాయక్, వి.రామానుజం, పత్రిక సంపాదకీయబృందం తదితరులు పాల్గొన్నారు.

# ఏపీ ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలన్నదే వైకాపా ప్రభుత్వ లక్ష్యం



గాజువాక: రాష్ట్రంలోని ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలన్నదే వైకాపా ప్రభుత్వం లక్ష్యమని గాజువాక వైకాపా ఎమ్మెల్యే తిప్పలనాగిరెడ్డి అన్నారు. గురువారం నియోజకవర్గ పరిధిలో క్యాన్సర్ వ్యాధి సోకి చికిత్స చేసుకునే స్థోమత లేక బాధపడుతున్న ముగ్గురు క్యాన్సర్ రోగులకు సి.యం.సహాయ నిధి నుంచి రూ.4లక్షల 50వేల రుపాయలకు సంబందించిన పత్రాలను ఎమ్మెల్యే నాగిరెడ్డి చేతులుమీదుగా అందజేసారు. ఈ సంధర్బంగా ఆయన మాట్లాడుతూ 51,61,65 వార్డులలో క్యాన్సర్ వ్యాదితో బాధపడుతున్న రేసు నూకాలమ్మ, సర్వసిద్ది సత్యవతి, పెద్దపూడి సింహాచలంలకు ఒక్కోరికి 1లక్ష 50వేలు చోప్పున సుమారు 4లక్షల 50వేలను అందజేసినట్లు తెలిపారు. క్యాన్సర్, కిడ్నీ, దీర్ఘకాలిక వ్యాధులు వ్యాపించి మెరుగైన వైద్యం చేయించకోలేని పేద ప్రజలకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి నిధులను మంజూరుచేసి, వారి ఆరోగ్య పరిరక్షణ కు చేయూతనిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్‌కు బాధితుల తరుపున కృతజ్ఞతలను తెలిపారు. అంతేకాకుండా 1000రుపాయలు దాటి చికిత్స చేసుకున్న ప్రతీ ఒక్క పేదవారికి కార్పోరేట్ చికిత్స అందించే విధంగా పథకం ప్రవేశ పెట్టనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టే పథకాలను ప్రతీ ఒక్కరూ సద్వి నియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్య క్రమంలో వైకాపా నాయకులు వి.వి.ఎన్. ఎం. రాజా, పాల అప్పలరెడ్డి, బొత్స వాసు, పెంటకోట పైడిరాజు, గంట్యాడ గురుమూర్తి, రెడ్డి జగన్నాధం, బాపినీడు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడాకారులకు అన్నివిధాలుగా ప్రోత్సాహం అందిస్తాం



గాజువాక: రాష్ట్రంలోని అన్ని విభాగాలకు చెందిన క్రీడాకారులకు అన్ని విధాలుగా ప్రోత్సహం అందించేందుకు వైకాపా ప్రభుత్వం సిద్ధంగాఉంది గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. వెటరన్ అథ్లెటిక్స్ అసోషియోషన్ ఆఫ్ విశాఖపట్నం ప్రతినిధులు ఆధ్వర్యంలో వైకాపా గాజువాక ఎమ్మెల్యే తిప్పలనాగిరెడ్డిని ఘనంగ సత్కరించారు. శాలువా కప్పి పుష్పగుఛ్చానిచ్చి ఆయనను అభినందించారు. గురువారం ఎమ్మెల్యే స్వగృహంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నాగిరెడ్డి పాల్గొని మాట్లాడుతూ క్రీడలను ప్రోత్సహించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాలికబద్దంగా ముందుకు పోతుందని, అందుకు రాష్ట్రముఖ్యమంత్రి వైయస్ జగన్ తగిన నిధులు కేటాయించారని అన్నారు. విద్యతో పాటు అన్ని వర్గాల క్రీడాకారులకు తగిన ప్రోత్సహం అందజేయడానికి ముఖ్యమంత్రి వైయస్ జగన్ కృషి చేస్తున్నట్లు తెలిపారు. క్రీడాకారులు క్రీడలలో రాణించి, జిల్లాకు, రాష్ట్రంనకు, దేశానికి అంతర్జాతీయ స్థాయిలో పేరుతేవాలని క్రీడాకారులకు సూచించారు. అసోషియేషన్ వైస్‌ప్రెసిడెంట్ అండిబోయిన అప్పారావు మాట్లాడుతూ వచ్చేనెల 13వ తారీఖున పోలీస్ బేరేక్స్‌లో గ్రౌండ్‌లో జరగబోవు జిల్లా స్థాయి పోటీలకు పాల్గొనదలచినవారు తమ పేర్లును నమోదు చేసుకోవాలని, అందుకు ఈ ఫోన్ నెం.98661 47679, కార్యదర్శి మంగవరప్రసాద్ సెల్.నెం. 9701347311లను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ క్రీడాకారిణి అండిబోయిన లక్ష్మి, ఎం.బాస్క రరావు, సన్నాసిరావు, వి.అప్పారావు, అనుసూరి సన్యాసిరావు, తాతారావు, కమిటీ మెంబర్స్ తదితరులు పాల్గొన్నారు.

# పారిశుధ్య నిర్వహణా లోపంతోనే వ్యాధులు

### లంచాలు మింగుతున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్లు కౌన్సిల్ సభ్యుల ఆరోపణ

కాకినాడ: కాకినాడ నగరపాలక సంస్థ సర్వసభ్య సాధారణ సమావేశం గురువారం నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో జరిగింది. మేయర్ సుంకర పావని అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పాలక, ప్రతిపక్ష సభ్యులంతా ఆరోపించారు.నగరంలో ప్రజారోగ్యం కుంటుపడిందని, తద్వారా అంటువ్యాధులపై అవగాహన కల్పించాల్సిన అధికారులు నిర్లక్ష్య వైఖరితో వ్యవహరిస్తూ వ్యాధుల ప్రభలడానికి కారణమయ్యారని ఆరోపించారు. ముఖ్యంగా డెంగ్యూ వ్యాధి తీవ్రతరం అయ్యిందని, నగరంలో జనవరి నుండి ఇప్పటి వరకు సుమారు 55కేసులు నమోదయ్యాయని, నగరంలోని పల్లపు ప్రాంతాలు, ముంపు ప్రాంతాలు, మురికి వాడలలో పారిశుధ్యం సరిగా నిర్వహించడం లేదని, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు లంచాలు మింగుతూ, పారిశుధ్య కార్మికులు రాకపోయినా వారికి మస్తరు వేస్తున్నారని, తద్వారా నిధుల దుర్వినియోగం జరుగుతుందని మేయర్ ప్రత్యేక శ్రద్ధతో పారిశుధ్య కార్మికుల హాజరును పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై కమిషనర్ కె.రమేష్ మాట్లాడుతూ సిబ్బంది కొరతతో పారిశుధ్య నిర్వహణ కొంత మేర లోపభూయిష్టం జరిగిన మాట వాస్తవమేనని అయినప్పటికీ ఉన్న సిబ్బందితో ఆరు ప్రత్యేక టీములు ఏర్పాటు చేసి నీరు నిలువ ఉన్న ప్రాంతాలలో ప్రత్యేక చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. ప్రధానంగా కొబ్బరి బొండాలు, ప్లాస్టిక్ సీసాలు, పూలకుండీలలోనే దోమలు ప్రబలుతున్నాయని, తద్వారా వ్యాధులు సంక్రమిస్తున్నాయని, వీటిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక సదస్సులు డివిజన్ల వారీగా ఆయా కమ్యూనిటీ సెంటర్లలో నిర్వహించడం జరుగుతుందని వెల్లడించారు. మేయర్ పావని మాట్లాడుతూ అన్ని రాజకీయ పార్టీల నుండి కౌన్సిల్ సభ్యులను ఒక కమిటీగా నియమించి వ్యాధులు, నివారణపై ప్రజలలో అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. అలాగే త్వరలో ఏర్పాటు చేయబోయే గ్రామ సచివాలయాలకు డివిజన్లలోని కమ్యూనిటీ హాళ్ళను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడంపై తెలుగుదేశం పార్టీ కౌన్సిలర్ పలివెల అశోక్ తీవ్రంగా వ్యతిరేకించారు. దీనిపై నగర కమిషనర్ సమాధానమిస్తూ రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పరిపాలనా సౌలభ్యం కొరకు గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుందని, అందులో భాగంగా కాకినాడ నగరంలో దాదాపు 90గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేయాల్సి ఉందని, ప్రస్తుత పరిస్థితులలో నూతన భవనాల ఏర్పాటుకు సమయం లేనందున తాత్కాలికంగా నగరంలోని కమ్యూనిటీ హాళ్ళను ఏర్పాటు చేసి సచివాలయాలకు స్వంత భవనాలు సమకూరినతర్వాత వాటిని కమ్యూనిటీ హాళ్ళ నుండి తరలిస్తామని హామీ ఇచ్చారు. ప్రైయివేటు భవనాల యజమానులు గ్రామ సచివాలయాకు తమ భవనాలు ఇచ్చేందుకు ముందుకు రాకపోవడంతో ఈ చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఒకవేళ ఎవరైనా సచివాలయ నిర్వహణకు భవనాలు అందిచినట్లయితే వాటిని అక్కడే ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

# రైతులకు దివీస్ లేబరేటరీ చేయూత




భీమునిపట్నం: భీమిలి మండలం చిప్పాడ పంచాయతీల సమ్మిళిత అభివృద్ధికి దివీస్ లేబరేటరీ చేయూత నిస్తుందని దివిస్ డిప్యూటీ జనరల్ మేనేజర్ వై.ఎస్. కోటేశ్వర రావు అన్నారు. అన్నవరం గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న కొబ్బరి, అరటి సాగు చేస్తున్న రైతులు మెరుగైన దిగుబడి సాధించేందుకు దివిస్ లేబరేటరీ లిమిటెడ్ కార్పొరేట్ సామాజిక బాధ్యత విధుల నుండి ఎరువులు పంచేందుకు గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు కొబ్బరి అరటి వంటి పంటలకు విశాఖ జిల్లాలోని ప్రత్యేక స్థానం ఉన్న అన్నవరం గ్రామం రైతులు మరింత దిగుబడి సాధించేందుకు కావలసిన సహకారం అందిస్తామని, ఉద్యానవన వ్యవసాయ పంటల సాగులో వస్తున్న నూతన మెలుకువలకు అనువుగా రైతులు తమ విజ్ఞానాన్ని పెంపొందించు కుని మెరుగైన ఫలితాలు సాధించాలని ఆయన అన్నారు.90 మంది రైతులకు ఎనిమిది లక్షల ఎబై వేల రూపాయలు విలువ చేసే ఎరువులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎంపిటిసి మైలపల్లి లక్ష్మణరావు మాట్లాడుతూ గ్రామం యొక్క సమగ్రాభివృద్ధికి సహాయం చేయాలని గ్రామ అవసరాలైన కమ్యూనిటీ హాల్ వీధి దీపాలు ఏర్పరచుకు నేనెందుకు ఆర్థికంగా చేయూత నివ్వాలని అన్నారు అన్నవరం గ్రామస్తుల ప్రధాన వృత్తి అయిన కొబ్బరి తోటల పెంపకానికి సహాయం చేయడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి ఎం రామస్వామి మాజీ ఉపసర్పంచ్ ఎం లక్ష్మణ్ రావు గ్రామ పెద్దలు సూరిబాబు ఎల్లాజీ ఎం అప్పారావు ఆదర్శ రైతులు నారాయణ రాజు దివిస్ కార్పొరేట్ సామాజిక బాధ్యత విభాగానికి చెందిన ఈ ఎస్ నాగరాజు, జీ వి.మోహనరావు, ఎం. వెంకటేశ్వర్లు,పైడి నాయుడు తదితరులు పాల్గొన్నారు,

# అవంతీలో మానస వ్యక్తిత్వ వికాసంపై తరగతులు



భీమునిపట్నం: తగరపువలస అవంతీ ఇంజినీరింగ్ కళాశాలలో నూతన విద్యా సంవత్సరం 2019-20లో ప్రవేశించిన ప్రదమ సంవత్సరం ఇంజినీరింగ్ విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస నిపుణులు వేణు కళ్యాణ్ చే గురువారం విద్యార్థులకు తరగతులు నిర్వహించారు.
ఇంజినీరింగ్ ,ఫార్మసీ ,మరియు డిప్లొమా విద్యార్థులు ఏ విదంగా భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకోవాలి,బావవ్యక్తీ కరణ,తోటి విద్యార్థులతో స్నేహ సంబందాలు సామూహిక ప్రవర్తన ఏర్పచుకొనుటలో వివిధ సోపానాలు తెలియజేశారు.తల్లి దండ్రులు గర్వపడే విదంగా మన ప్రవర్తన ఉండాలనే కెరిర్ మనమే రూపొందించు కోవాలని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ ఎన్ వి గణేష్ ,డైరెక్టర్లు డాక్టర్ ఎ, చంద్రశేఖర్, ఎస్ రాఘవరావు,ప్లేస్మెంట్ అదికారి రంజిత్ కుమార్,కళాశాల అద్యాపకులు పాల్గొన్నారు.

# పోషక్ అభియాన్‌లో బాలింతలకు సీమంతాలు



భీమునిపట్నం: స్థానిక ఎస్.వి.ఎల్.ఎన్.ఎస్. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోషక్ అభియాన్ కార్యక్రమం లో బాగంగా ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఆద్వర్యంలో గురువారం భీమిలి తోటవీది సామాజిక భవనం లో జరిగిన పోషక్ అబియాన్ కార్యక్రమంలో బాలింతలకు మరి యు పిల్లలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు,పౌష్టిక ఆహారం గురించి వివరించారు.

అనంతరం బాలింతలకు సీమంతాలు చేశారు.ఎన్.ఎస్.ఎస్. విద్యార్థులు అంగన్వాడీ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎన్.ఎస్ ఎస్.ప్రోగ్రాం అధికారిని డాక్టర్ జి నాగ లక్ష్మమ్మ,ఐ.సి డి సి అధికారిని వెంకటేశ్వరి,సూపర్ వైజర్ నాగేశ్వరి, ఆర్.ప్రభాకర్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవు

### -మల్కాపురం సి.ఐ. పి.వి.బి. ఉదయ్‌కుమార్



సింధియా: తోటి విద్యార్థులపై ప్రేమగా మెలగాలని, ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్‌లకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని మల్కాపురం పోలీస్‌స్టేషన్ హౌస్ ఆఫీసర్ పి.వి.బి.ఉదయ్‌కుమార్ హెచ్చరించారు. గురువారం మల్కాపురం స్థానిక సెయింట్ ఆన్స్ బాలికల కళాశాలలో విద్యార్థులకు ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మల్కాపురం పోలీస్‌స్టేషన్ హౌస్ ఆఫీసర్ పి.వి.బి.ఉదయకుమార్ పాల్గొని మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ తోటి విద్యార్థులపట్ల సోదరభావాన్ని కల్గి ఉండాలని, సీనియర్లు జూనియర్లపట్ల ప్రేమభావంగా మెలగాలని సూచించారు. బయట జరుగుతున్న నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, నడవడికను మెరుగుపర్చుకోవాలని కోరారు. అలాగే ప్రతీ ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్గివుండాలని, వాహనాలను నడిపేటప్పుడు అన్ని ధృవపత్రాలు కల్గివుండాలని, సీట్‌బెల్ట్, హెల్‌మెట్ ధరించాలని, అతివేగం వద్దని సూచించారు. సంఘ వ్యతిరేక కార్యక్రమాలను పాల్పడితే కఠిన శిక్షలు తప్పవని, తద్వారా విలువైన జీవితం నాశనం అవుతుందని హెచ్చరించారు. ఇతరులనుంచి ఎవరికైన ఎటువంటి ఇబ్బంది ఉన్న తమదృష్టికి తీసుకురావాలని వారిపై తగిన చర్యలు తీసుకుంటామని బాధితులకు న్యాయం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు, ఉపాద్యాయులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆదిత్యలో నానో టెక్నాలజీపై వర్క్ షాప్




గండేపల్లి: తూర్పు గోదావరిజిల్లా గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్యకాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ టెక్నాలజీ కళాశాలకుచెందిన కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగంలో నానో టెక్నాలజీ అనే అంశంపై కార్యశాలను నిర్వహించినట్లు ప్రిన్సిపాల్స్ డా.టి.కె.రామకృష్ణా రావు తెలియజేసారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా జె.ఎన్.టి.యు.అనంతపురం పూర్వవైస్ ఛాన్స్ లర్, ఆంధ్రప్రదేశ్ ఐ.ఎస్.టి.యు. సెక్షన్ చైర్మన్ కె.లాల్ కిషోర్ విచ్చేసి ప్రసంగించారు. ఈసందర్బంగా లాల్ కిషోర్ మాట్లాడుతూ అతిథి ఉపన్యాసం యొక్క ముఖ్య లక్ష్యం విద్యార్థులను నానిక్రిస్టలైన్ పదార్థాలు, వాటి ప్రత్యేక లక్షణాలు మరియు విభిన్న అనువర్తనాలతో పరిచయంచేయడంఅని అన్నారు. నానో టెక్నాలజీ యొక్క విశిష్టతను గురించి వివరించారు.ఈకార్యక్రమంలో క్యాంపస్ డైరెక్టర్ డా.ఎమ్.శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్స్ డా.టి.కె.రామకృష్ణారావు,డా.ఆదిరెడ్డి రమేష్, వైస్‌ప్రిన్సిపాల్.ఎ.రామకృష్ణ,విభాగాధిపతిఎం.అనిల్ కుమార్,ఐ.ఎస్.టి. యు.కో.ఆర్డినేటర్ బి.మాణిక్యాల రావు,ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రభుత్వాలకు, మీడియాకు వారధిగా పి.ఐ.బి పనిచేస్తోంది

**- కలెక్టర్ శ్రీ శామ్యూల్ ఆనంద్ కుమార్ - దేశాభివృద్ధిలో గ్రామీణ విలేకరుల పాత్ర కీలకం - పి.ఐ.బి. అదనపు డీజీ డి. మురళిమోహన్**



గుంటూరు : ప్రభుత్వాలకు, మీడియాకు వారధిలా పత్రికా సమాచార కార్యాలయం పనిచేస్తోందని గుంటూరు జిల్లా కలెక్టర్ శామ్యూల్ ఆనంద్ కుమార్ అన్నారు. నగరంలో కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన పత్రికా సమాచార కార్యాలయం, విజయవాడ ఆధ్వర్యంలో పాత్రికేయులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం వార్తాలాప్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా కలెక్టర్ శామ్యూల్ ఆనంద్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులలో సమాచార వ్యవస్థ వేగంగా ముందుకు సాగుతోదని, అందుకు అనుగుణంగా ఆధునిక పరిజ్ఞానాన్ని వినియోగించి ప్రభుత్వానికి, మీడియాకు మధ్య వారధిగా పత్రికా సమాచార కార్యాలయం పనిచేస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలకు విస్తృత ప్రచారాన్ని కల్పించే బాధ్యతను ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో విజయవంతగా నిర్వహిస్తోందని ప్రశంసించారు. ప్రభుత్వ పధకాలను ప్రజలు సమగ్రంగా వినియోగించుకునే విధంగా, పత్రికలు తమ కధనాలు ద్వారా తెలియపరుస్తాయని ఆయన అన్నారు. ప్రజాస్వామ్యంలో అన్ని వ్యవస్థలు సామాన్యుడి కోసం పని చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన అభిప్రాయ పడ్డారు.

పి.ఐ.బి. ఆంధ్ర ప్రదేశ్ రీజియన్ అడిషనల్ డైరక్టర్ జనరల్ డి. మురళి మోహన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వివిధ అభివ ృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని, వీటిని క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరవేసేందుకు పి.ఐ.బి. కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వ పథకాలకు సంబంధించిన సమాచారాన్ని ప్రాంతీయ మీడియాకు చేరవేయడంతో పాటు, స్థానిక స్థితిగతులపై ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు పి.ఐ.బి నివేదిక అందిస్తుందని తెలిపారు. ఏదైనా అంశంపై ప్రజల్లో సంశయం ఏర్పడినప్పుడు వాటిని నివృత్తి చేసేలా పి.ఐ.బి కచ్ఛితమైన సమాచారం అందిస్తుందన్నారు. వివిధ సాంస్కృతిక, కళా రంగాల ద్వారా, పత్రికా మాధ్యమాల ద్వారా, ప్రకటనల ద్వారా ప్రభుత్వ పధకాల గురించి పిఐబి విస్త ృతంగా ప్రచారం నిర్వహిస్తుందన్నారు.

ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిధిగా హాజరైన సీనియర్ పాత్రికేయులు పద్మశ్రీ యడ్లపల్లి వెంకటేశ్వర్రావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే పధకాలకు విస్త ృతంగా ప్రచారం కల్పించే పి.ఐ.బి. విలేకరులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ది హిందూ పత్రిక గుంటూరు బ్యూరో చీఫ్ శామ్యూల్ జొనాథన్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన ఖచ్చితమైన సమాచారాన్ని పి.ఐ.బి. అందిస్తుందన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి, ప్రభుత్వ పథకాలపై ప్రజల్లో ఉన్న అపోహలు, అనుమానాలను నివృత్తి చేసేందుకు పిఐబి క ృషిచేస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పి.ఐ.బి. అధికారులు, రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన వివిధ విభాగాల అధికారులు, గుంటూరు జిల్లాకు చెందిన వివిధ గ్రామీణ, ప్రాంతీయ స్థాయి పత్రికా ప్రతినిధులు, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు హాజరయ్యారు.




# ఏపీఈపీడీసీఎల్‌కు జాతీయ అవార్డు




విశాఖపట్నం: ఇంధన సామర్ధ్యాన్ని పెంచుకునేందుకు తీసుకుంటున్న చర్యలకు CII - 20వ నేషనల్ అవార్డ్స్ - ఎక్సలెన్స్ ఇన్ ఎనర్జీ మేనేజిమెంట్-2019' లో ఏపిఈపిడిసిఎల్ మొదటి బహుమతిని సొంతం చేసుకుంది. విద్యుత్ వినియోగంలో ఇంధన సామర్ధ్యాన్ని పెంచుకునేందుకు ఏపీఈపిడిసిఎల్ అవలంభిస్తున్న విధానాలకు ఎక్సలెన్స్ ఎనర్జీ ఎఫిషియంట్ యూనిట్ విభాగంలో ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఈ అవార్డును సాధించింది. కాన్ఫెడరేషన్ అఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (CII) అధ్వర్యంలో ఈ నెల 16వ తేది నుండి 18వ తేది వరకు 18వ ఎనర్జీ ఎఫిషియన్సీ సమ్మిట్ 2019' పేరిట హైదరాబాద్ హెచ్.ఐ.సి.సిలో బుధవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో ఏపీఈపిడిసిఎల్ సి.ఎం.డి నాగలక్ష్మి సెల్వరాజన్ తరపున చీఫ్ జనరల్ మేనేజర్ (ఎనర్జీ కన్జర్వేషన్) జి.శరత్ కుమార్, తెలంగాణ రాష్ట్ర ట్రాన్స్‌కో సిఎండి డి.ప్రభాకర్ రావు చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు.

ఏపీఈపిడిసిఎల్ పరిధిలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల వినియోగదారులకు అంకిత భావంతో సేవలందిస్తున్న ఏపీఈపిడిసిఎల్ సిబ్బంది కార్యదక్షతకు ఈ అవార్డు చిహ్నామని సంస్థ సిఎండి నాగలక్ష్మి సెల్వరాజన్ ప్రశంసించారు. ఈ సందర్భంగా సిఎండి అధికారులను అభినందిస్తూ వినియోగదారులకు నాణ్యమైన నిరంతరాయ విద్యుత్తును అందిస్తూ, ఇంధన సామర్ధ్యాన్ని పెంచుకొనేందుకు అవసరమైన మరిన్ని చర్యలను తీసుకుంటూ, విద్యుత్ సరఫరాలో నష్టాలను తగ్గించుకోవడం ద్వారా మరెన్నో అవార్డులను సాధించాలని ఉద్యోగులకు దిశానిర్దేశం చేశారు.

# కలెక్టరేట్ నిర్మాణ భవన పరిశీలన

**మంత్రి, ధర్మాన కృష్ణదాస్, ముఖ్య కార్యదర్శి యం.టి. కృష్ణబాబు**



శ్రీకాకుళం: జిల్లా కలెక్టర్ కార్యాలయ నిర్మాణ భవనాన్ని రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి ధర్మాన కృష్ణదాస్, ఆర్ అండ్ బి ముఖ్య కార్యదర్శి యం.టి.కృష్ణబాబు జిల్లా కలెక్టర్ జె నివాస్‌తో కలసి గురువారం పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న భవన పనులను పరిశీలించి పనుల సరళిని అడిగి తెలుసుకున్నారు. జిల్లా పరిపాలన భవనం చక్కగా ఉండాలని మంత్రి అన్నారు. భవనం పూర్తి చేయుటకు అవసరమైన నిధులు మంజూరుకు చర్యలు తీసుకోవాలని ముఖ్య కార్యదర్శికి సూచించారు. ప్రభుత్వం రూ.116 కోట్లతో పరిపాలన ఆమోదం తెలియజేయగా రూ.78 కోట్లకు కాంట్రాక్టు ఒప్పందం జరిగిందని ఆర్ అండ్ బి పర్యవేక్షక ఇంజనీరు కె.కాంతిమతి తెలిపారు. దీనిపై ముఖ్య కార్యదర్శి స్పందిస్తూ కాంట్రాక్టు ఒప్పందం మేరకు పనులు పూర్తి చేయాలని సూచించారు. పరిపాలన ఆమోదం మేరకు నిధుల విడుదలకు ప్రతిపాదనలు సమర్పించాలని పేర్కొన్నారు. భవన నిర్మాణ కాంట్రాక్టర్ నిర్మాణ పనులకు రూ.22 కోట్లు బకాయిలు ఉన్నాయని వాటిని విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి చీఫ్ ఇంజనీరు డా.మనోహర్ రెడ్డి, రెవిన్యూ డివిజనల్ అధికారులు యం.వి.రమణ, ఐ.కిషోర్, ఆర్ అండ్ బి పర్యవేక్షక ఇంజనీరు కె.కాంతిమతి, ఆర్ అండ్ బి అధికారులు పాల్గొన్నారు.

# జస్టిస్ ఈశ్వరయ్యకు ఏపీలో కీలక పదవి



అమరావతి : ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్య రెగ్యులటరీ అండ్ మానిటరింగ్ కమిషన్ చైర్మన్‌గా ఉమ్మడి ఏపీ హైకోర్టు మాజీ తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ వంగాల ఈశ్వరయ్య నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. కాగా ఉన్నత విద్యా సంస్థల్లో ప్రమాణాలు పెంచడంతో పాటు మౌలిక సదుపాయాల కల్పన, ఫీజుల నియంత్రణ తదితర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉన్నత విద్యా నియంత్రణ, పర్యవేక్షణకు రాష్ట్ర ప్రభుత్వం కమిషన్ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ కమిషన్‌లో ఇద్దరు ప్రొఫెసర్లు, ఓ ఐఏఎస్ అధికారి, ఉన్నత విద్యాసంస్థ ప్రతినిధి... సభ్యులుగా ఉంటారు. హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) జస్టిస్ ప్రవీణ్‌కుమార్‌ను సంప్రదించిన మీదట, రాష్ట్ర ప్రభుత్వం జస్టిస్ ఈశ్వరయ్యను కమిషన్ చైర్మన్‌గా నియమించాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు ఇవాళ జారీ అయ్యాయి. కాగా స్కూల్ ఎడ్యుకేషన్ రెగ్యులేటరీ అండ్ మానిటరింగ్ కమిషన్ చైర్మన్‌గా రిటైర్డ్ జడ్జి జస్టిస్ ఆర్.కాంతారావును ప్రభుత్వం నియామకం చేసింది.

**ఐటీ (టిక్నికల్) సలహాదారులుగా..**

అలాగే ఆంధ్రప్రదేశ్ ఐటీ (టిక్నికల్) సలహాదారులుగా శ్రీనాథ్ దేవిరెడ్డి, జె. విద్యాసాగర్‌రెడ్డిను నియమిస్తూ ఏపీ సర్కార్ ఉత్తర్వులు ఇచ్చింది. అదేవిధంగా ఏపీ ఐటీ (పాలసీ అండ్ ఇన్వెస్ట్‌మెంట్) సలహాదారునిగా కె. రాజశేఖర్‌రెడ్డిని నియమించింది.

# ఓటర్ల ధృవీకరణ కార్యక్రమం వేగవంతం చేయాలి

**రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి విజయానంద్**




విశాఖపట్నం : కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల ధృవీకరణ కార్యక్రమం సత్వరమే పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కె.విజయానంద్ తెలిపారు. గురువారం నాడు సచివాలయం నుండి ఆయన జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయన పౌరులు అందరూ తమ పేరు ఓటర్ల జాబితాలో నమోదు కాబడినది లేనిది సరిచూచుకోవాలని తెలిపారు. పౌరులు తమ ఓటు వివరాలు ఓటరు హెల్ప్ లైన్ మొబైల్ యాఫ్ ద్వారా కాని, అజంజా.ఱఅ వెబ్ సైట్ నందు కాని లేదా మీ - సేవ సెంటర్లు, బూత్ లెవెల్ అధికారి వద్ద కాని పరిశీలించుకోవాలని తెలిపారు. గ్రామ, వార్డు వాలంటీర్లను కూడా ఈ కార్యక్రమానికి వినియోగించుకోవాలని తెలిపారు.

విశ్వవిద్యాలయాలు, ఇంజనీరింగు, డిగ్రీకాలేజీలలో ప్రత్యేక క్యాంపులు నిర్వహించి విద్యార్థులు వారి కుటుంబ సభ్యుల ఓటర్ల ధృవీకరణ చేపట్టాలని తెలిపారు. పోలింగ్ స్టేషన్ల వారిగా సరిహద్దులను నమోదు చేయాలని తెలిపారు. పేర్లు వివరాల మార్పుల పై అభ్యంతరాలను సత్వరమే పరిష్కరించాలని తెలిపారు. ఓటర్ల జాబితా డ్రాఫ్టును అక్టోబరు 15న ప్రచురించాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ వినయ్ చంద్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు లక్షా 69వేల ధరఖాస్తులు వచ్చాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎల్.శివశంకర్, జెసి-2 సూర్యకళ, పాడేరు ఇన్ చార్జి పి ఓ ఎస్.వెంకటేశ్వర్ ఇతర అధికార్లు పాల్గొన్నారు.



# విధులను నిబద్ధతతో, అంకితభావంతో నిర్వర్తించండి

- అలసత్వం, నిర్లక్ష్యం, అసమర్థత లేకుండా చూసుకోండి
- వారానికి ఒకసారి రెవెన్యూ విభాగంపై సమీక్ష
- అధికారులు, సిబ్బందికి కౌన్సిలింగ్, వార్నింగ్
- జివిఎంసి కమిషనర్ డా.జి.సృజన



విశాఖపట్నం: రెవెన్యూ విభాగం అధికారులు, ట్యాక్సుకలెక్టర్లు విధులను నిబద్ధత, అంకిత భావంతో పన్నులను వసూలు చేయడం ద్వారా లక్ష్యాలను సాధించాలని జివియంసి కమిషనర్ డా.జి.సృజన పేర్కొన్నారు. కాన్ఫరెన్స్ హాలులో గురువారం ఆమె రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అలసత్వం, నిర్లక్ష్యం, అసమర్థత లేకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. వారానికి ఒకసారి అధికారులు, ట్యాక్సుకలెక్టర్ల పనితీరుపై సమీక్షించనున్నట్లు వివరించారు. సక్రమంగా విధులు నిర్వర్తించేలా కౌన్సిలింగ్, మార్పు లేని సిబ్బందిపై కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి రోజు సాయంత్రం రెవెన్యూ అధికారులు రోజువారి పన్ను వసూలు వివరాలను జోన్ల వారీగా డి.సి.ఆర్.కు అందజేయాలని కోరారు. పన్నుల వసూలులో అవకతవకలు లేకుండా సమభావంతో పనిచేయాలని సూచించారు. అనైతికంగా వ్యవహరించవద్దని పేర్కొన్నారు. ఉత్తమ సేవలందించడం ద్వారా ప్రజల మన్ననలను పొందాలని సూచించారు. వార్డు సచివాలయ కార్యాలయాలను గుర్తించి వివరాలివ్వాలని, ఇప్పటివరకు 270 కార్యాలయాలు గుర్తించగా ఇంకా 300 కార్యాలయాలకు భవనాలు గురించాలని కోరారు.

సమావేశంలో అదనపు కమిషనర్లు ఆర్.సోమన్నారాయణ, డిసిఆర్ ఫణిరాం, అందరు ఆర్.ఓలు, ట్యాక్సు కలెక్టర్లు హాజరైనారు.

**బీజేపీలో చేరాలని**

# కోడెల ఎందుకు ప్రయత్నించారు?

**మంత్రి బొత్స సత్యనారాయణ**



అమరావతి: ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ కోడెల శివప్రసాదరావు మరణంపై టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు రాజకీయం చేస్తున్నారని మంత్రి బొత్స సత్యనారాయణ మండి పడ్డారు. కోడెల చనిపోయారన్న కనీస సానుభూతి లేకుండా రాజకీయ లబ్ధి కోసం వెంపర్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో టీడీపీ అధినేత చంద్రబాబుపై బొత్స సత్యనారాయణ ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా చంద్రబాబుకు పలు ప్రశ్నలు సంధించారు. 'పార్టీలో పనిచేసే వారికి గౌరవం లేదని కోడెల బాధపడింది నిజమా కాదా? ఆయనను చంద్రబాబు ఎందుకు దూరం పెట్టారు? కోడెల బీజేపీలో చేరాలని ఎందుకు ప్రయత్నించారు? సొంత పార్టీ నేతలే ఆయనపై ఎందుకు ఫిర్యాదు చేశారు? కోడెల సెల్‌ఫోన్ మాయంపై బాబు ఎందుకు మౌనంగా ఉన్నారు?'అంటూ మంత్రి ప్రశ్నించారు. అంతేకాకుండా కోడెల మ ృతిపై సీబీఐ దర్యాప్తు చేయాలని బాబు అడగడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాష్ట్రంలో సీబీఐ రాకూడదన్న చంద్రబాబు ఇప్పుడు కోడెల మరణంపై సీబీఐ దర్యాప్తునకు ఎలా డిమాండ్ చేస్తున్నారని ప్రశ్నించారు. అదేవిధంగా గవర్నర్ వ్యవస్థపై టీడీపీ అధినేత చేసిన అనుచిత వ్యాఖ్యలు అందరికీ గుర్తున్నాయని అన్నారు. కేంద్రానికి గవర్నర్ ఏజెంట్ అని చంద్రబాబు విమర్శించిన విషయాన్ని గుర్తుచేశారు. అటువంటి విమర్శలు చేసిన బాబు ఇప్పుడు ఏ మొఖం పెట్టుకుని గవర్నర్ దగ్గరికి వెళ్లారని ప్రశ్నించారు.




VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ☆ Phone : 2564353, Fax : 0891-2569004 ☆ e-mail: vijayabhanudaily@gmail.com